



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు







సంపుటి : 1 సంచిక : 140 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : ఒంగోలు ఆదివారం 25 జనవరి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE :140 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : ONGOLE SUN 25 JANUARY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur




## అమెరికాలో మంచు తుపాను విలయతాండవం...

### 16 రాష్ట్రాల్లో ఎమర్జెన్సీ, 8,000 విమానాలు రద్దు!

- అమెరికాను ముంచెత్తుతున్న భారీ మంచు తుపాను
- దాదాపు 20 కోట్ల మంది ప్రజలపై తీవ్ర ప్రభావం
- 16కు పైగా రాష్ట్రాల్లో స్టేట్ ఆఫ్ ఎమర్జెన్సీ విధింపు
- వారాంతంలో 8,000కు పైగా విమాన సర్వీసులు రద్దు
- పలు ప్రాంతాల్లో విపత్తు స్థాయి మంచు పేరుకుపోయే ప్రమాదం

పెన్ పవర్ డెస్క్:అమెరికా చరిత్రలోనే అత్యంత తీవ్రమైన మంచు తుపానుల్లో ఒకటి దేశాన్ని అతలాకుతలం చేస్తోంది. టెక్సాస్ నుంచి న్యూ ఇంగ్లాండ్ వరకు సుమారు 2,000 మైళ్ల విస్తీర్ణంలో ఈ తుపాను ప్రభావం చూపుతుండటంతో అగ్రరాజ్యం గజగజ వణికిపోతోంది.

- మిగతా 2లో...



## మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ...

### ఇద్దరు మావోలు అరెస్ట్

- దండకారణ్య స్పెషల్ జోన్ కమిటీ మెంబర్ సాల్మన్, ఆయన భార్య అరెస్ట్
- అచ్చంపేటకు వచ్చిన మావోయిస్టు దంపతులు
- అరెస్ట్ చేసిన నాగర్ కర్నూలు పోలీసులు

పెన్ పవర్ డెస్క్:ఇప్పటికే వరుస ఎన్ కౌంటర్లు, లొంగుబాట్లతో భారీగా దెబ్బతిన్న మావోయిస్టు పార్టీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీ దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ మెంబర్, మిలిటరీ

- మిగతా 2లో...

## నా మిత్రుడు అనునిత్యం నగరి కోసం తపించేవారు

- కుప్పం తరహాలో నగరి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని సీఎం హామీ
- 2029 నాటికి నగరికి కృష్ణా జలాలు తీసుకువస్తానని వెల్లడి
- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా నగరిలో సీఎం చంద్రబాబు పర్యటన
- రాష్ట్రవ్యాప్త సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టులకు శంకుస్థాపన
- వలసలు నివారించేందుకు పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని స్పష్టీకరణ



పెన్ పవర్ డెస్క్:చిత్తూరు జిల్లా నగరి నియోజకవర్గాన్ని తన సొంత నియోజకవర్గమైన కుప్పం తరహాలో అభివృద్ధి చేస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చారు. 2029 ఎన్నికల నాటికి నగరికి కృష్ణా జలాలను తీసుకొచ్చి సాగు, తాగునీటి కష్టాలు తీర్చే బాధ్యత తనదని ఆయన స్పష్టం చేశారు. స్థానిక యువత ఉపాధి కోసం వలసలు వెళ్లకుండా పరిశ్రమలను తీసుకొస్తామని భరోసా ఇచ్చారు. శనివారం నగరిలో నిర్వహించిన 'స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగిస్తూ అభివృద్ధిపై కీలక హామీలు ఇచ్చారు.నగరితో తనకున్న అనుబంధాన్ని ప్రస్తావిస్తూ, "నగరి తెలుగుదేశం పార్టీకి కంచుకోట. నా మిత్రుడు, దివంగత నేత గాలి ముద్దుకృష్ణమ నాయుడు ఈ ప్రాంత ప్రజల కోసం నిరంతరం తపించేవారు. గడిచిన ఐదేళ్లలో ఇక్కడ అభివృద్ధి ఆగిపోయింది. ఇప్పుడు మళ్లీ మంచి రోజులు మొదలయ్యాయి" అని వ్యాఖ్యానించారు. పేదల అభ్యున్నతి కోసం చేపట్టిన పీ4 (పేదరికంపై గెలుపు) కార్యక్రమంలో భాగంగా బంగారు కుటుంబాలను ఆదుకునేందుకు ముందుకొచ్చిన మార్గదర్శులను కూడా సీఎం సత్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే గాలి భాను ప్రకాశ్ నాయుడు, ఎంపీ డి.ప్రసాదరావు తదితర నేతలు, అధికారులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమం సందర్భంగా ముఖ్యమంత్రి రాష్ట్రవ్యాప్తంగా సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. వ్యర్థాల సేకరణ కోసం రూపొందించిన 'స్వచ్ఛ రథాల'ను జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ప్రజా వేదిక వద్ద ఏర్పాటు చేసిన మెప్మా, డ్వాక్రా మహిళల ఉత్పత్తుల స్టాళ్లను పరిశీలించి వారిని అభినందించారు. పారిశుద్ధ్య కార్మికుల సేవలను కొనియాడుతూ పలువురిని సన్మానించారు.

"స్వచ్ఛాంధ్ర అనేది కేవలం ప్రభుత్వ కార్యక్రమం కాదు, అది మనందరి జీవన విధానం కావాలి. ఏడాది క్రితం ఒక ఉద్యమంలా ప్రారంభించిన ఈ కార్యక్రమంలో ప్రతి నెలా మూడో శనివారం నేతలు, అధికారులు పాల్గొంటున్నారు. ప్రజలంతా భాగస్వాములైతేనే దీని లక్ష్యం నెరవేరుతుంది" అని పిలుపునిచ్చారు. సమైక్యాంధ్రలో సీఎంగా ఉన్నప్పుడు తాను ప్రారంభించిన జన్మభూమి, పచ్చదనం-పరిశుభ్రత కార్యక్రమాలను ఆయన గుర్తుచేశారు.

## సినీ గ్లామర్ తో రాజకీయాల్లో విజయం సాధించడం సాధ్యం కాదు

### కేంద్ర మంత్రి శ్రీనివాస్ వర్మ



- ఎన్టీఆర్ తర్వాత సినీ ఇమేజ్ మీదే నిలదొక్కుకున్న ఉదాహరణలు లేవన్న వర్మ
- సమస్యలపై పోరాటమే రాజకీయాల్లో అసలైన బలం అని వ్యాఖ్య
- పవన్ బలమైన ప్రజా నాయకుడిగా ఎదిగారని వ్యాఖ్య

పెన్ పవర్ డెస్క్:సినిమా గ్లామర్ ఒక్కటే ఆధారంగా పెట్టుకుని రాజకీయాల్లో దీర్ఘకాల విజయం సాధించడం సాధ్యం కాదని కేంద్ర సహాయమంత్రి శ్రీనివాస్ వర్మ కీలక వ్యాఖ్యలు చేశారు. విశాఖపట్నంలో మీడియాతో మాట్లాడిన ఆయన, ఎన్టీఆర్ తర్వాత కేవలం సినీ ఇమేజ్ మీదే రాజకీయాల్లో నిలదొక్కుకున్న ఉదాహరణలు లేవని స్పష్టం చేశారు. ప్రజలతో మమేకమయ్యే నాయ కత్వం, వారి సమస్యలపై పోరాటమే రాజకీయాల్లో అసలైన బలం అని ఆయన అభిప్రాయపడ్డారు.అయితే, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను మాత్రం భిన్నంగా చూడాలన్నారు. పవన్ కల్యాణ్ కేవలం సినీ నటుడిగానే కాకుండా, ప్రజల మధ్య ఉండే బలమైన ప్రజా నాయకుడిగా ఎదిగారని శ్రీనివాస్ వర్మ ప్రశంసించారు. ప్రజా సమస్యలపై నేరుగా పోరాడటం, ప్రజలతో సన్నిహితంగా మెలగడం ఆయన ప్రత్యేకత అని పేర్కొన్నారు. అలాగే, కూటమిగా కలిసి

- మిగతా 2లో...



## విదేశాల్లో భారత్ 'వాంటెడ్'.. రెండేళ్లలో 70 మంది గుర్తింపు

- 'వాంటెడ్' జాబితాలో ఉన్న వారిలో 70 మంది విదేశాల్లో ఉన్నారు: కేంద్ర ప్రభుత్వం
- పరారీలో ఉన్న వారి గుర్తించే ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతుందన్న కేంద్రం
- ఇతర దేశాలు వెతుకుతున్న 203 మంది నిందితులు భారత్‌లో ఉన్నట్లు వెల్లడి
- వాంటెడ్ జాబితాలో ఉన్న వారిలో 27 మంది గత ఏడాది తిరిగి వచ్చినట్లు వెల్లడి

పెన్ పవర్ డెస్క్:గత రెండేళ్లలో 'వాంటెడ్' జాబితాలో ఉన్న వారిలో 70 మంది విదేశాల్లో ఉన్నట్లు గుర్తించామని కేంద్ర ప్రభుత్వం ఒక నివేదికలో తెలిపింది. వివిధ కేసుల్లో నిందితులుగా ఉండి, పరారీలో ఉన్న వారిని గుర్తించే ప్రక్రియ

- మిగతా 2లో...

## బాలికల విషయంలో ఇప్పటికీ సమాజ దృక్పథంలో మార్పు రావాల్సి ఉంది



- బాలికల పట్ల అందరూ బాధ్యతగా వ్యవహరించాలన్న కందుల దుర్గేశ్
- వారు ఆత్మవిశ్వాసంతో ఎదిగేలా తీర్చిదిద్దాలని వ్యాఖ్య
- వారి భద్రత విషయంలో నిర్లక్ష్యం చోటు చేసుకోకూడదని హెచ్చరిక

పెన్ పవర్ డెస్క్:సమాజంలో బాలికల భద్రత, వారి చదువు, ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని రాష్ట్ర మంత్రి కందుల దుర్గేశ్ అన్నారు. బాలికల విషయంలో ఇప్పటికీ సమాజ దృక్పథంలో మార్పు రావాల్సి ఉందని ఆయన వ్యాఖ్యానించారు. నిడదవోలులోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన 'జాతీయ బాలికా దినోత్సవం' కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా

- మిగతా 2లో...

## బాలికలే భవిష్యత్ దీపికలు



పెన్ పవర్ డెస్క్:జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా మంత్రి నారా లోకేశ్ శుభాకాంక్షలు తెలిపారు. బాలికలే భవిష్యత్ దీపికలని పేర్కొన్నారు. 'సరైన నైపుణ్యాలు, అవకాశాలు కల్పిస్తే బాలికలు ఆకాశమే హద్దుగా రాణిస్తారు. వారి హక్కులు, విద్య, భద్రత కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది. బాలికలపై వివక్షను విడనాడదాం.. వారికి సమాన హక్కులు కల్పిద్దాం" అని లోకేశ్ అన్నారు.

## భారత్ పై తగ్గనున్న ట్రంప్ టారిఫ్ లు..!



- భారత్ పై 50 శాతం సుంకాలు వసూలు చేస్తున్న అమెరికా
- ఇటీవల రష్యా నుంచి కొనుగోళ్లు తగ్గించిన భారత్
- 25 శాతం టారిఫ్ లు తగ్గించనున్నట్లు అమెరికా ఆర్థిక మంత్రి హింట్

పెన్ పవర్ డెస్క్:భారత్ పై అమెరికా అధ్యక్షుడు విధించిన టారిఫ్ లు తగ్గించే యోచనలో ఉన్నట్లు అగ్రరాజ్యం సంకేతాలు వెలువరించింది.

- మిగతా 2లో...



## భారత్ సంస్కరణల ఎక్స్‌ప్రెస్‌గా ఎదుగుతోంది

- ప్రపంచంలో అత్యధిక యువత మన దేశంలోనే ఉందన్న ప్రధానమంత్రి
- యువతకు అవకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ ఉద్దేశమన్న మోదీ
- వివిధ దేశాలతో వాణిజ్య ఒప్పందాల ద్వారా విదేశాల్లోని భారత యువతకు అవకాశాలు లభిస్తాయని వెల్లడి

పెన్ పవర్ డెస్క్:భారతదేశం సంస్కరణల ఎక్స్‌ప్రెస్‌గా ఎదుగుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ప్రపంచంలోనే అత్యధిక యువత కలిగిన దేశం

- మిగతా 2లో...

## ఎడిటర్ వ్యూ

# ప్రతీ చోటా జగనన్న సైన్యం... పక్కా వ్యూహం !

వైసీపీ అధినేత గత ఇరవై నెలలుగా తాను తెర వెనకన ఉంటున్నారు. పార్టీని ముందు పెడుతున్నారు. ప్రతీ ఆందోళనను పార్టీ నాయకులు చేసేలా చూస్తున్నారు. మెడికల్ కాలేజీలు ప్రైవేట్ పరం కాకుండా ఈ మధ్యన చేసిన ఆందోళన చాలా వరకూ సక్సెస్ అయింది. కోటి సంతకాల పేరుతో పార్టీలో కొంత చైతన్యం వచ్చింది. అయితే 2024లో ఓటమి తరువాత నుంచి జగన్ చేస్తున్నది చెబుతున్నదీ ఒక్కటే. పార్టీని పటిష్టంగా ఉంచాలని. పార్టీ బాగుంటేనే అంతా బాగుంటారు అని. అందుకే ఆయన కమిటీల మీదనే ఫుల్ ఫోకస్ పెట్టేశారు.

**బూత్ లెవెల్ నుంచి :**

ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో బూత్ లెవెల్ నుంచి కమిటీలు వేయమని జగన్ ఆయా నియోజకవర్గం ఇంచార్జిలను కోరుతూ వస్తున్నారు. ఈ కమిటీలు కూడా కేవలం మొత్తం అనుబంధ సంఘాలతో కలిపి వేయమంటున్నారు. అంటే మహిళ, యువత, విద్యార్థి, కార్మిక, రైతు విభాగాలు అన్న మాట. ఇలా అధ్యక్షుడు ఒకరు, ఉపాధ్యక్షులు ఇద్దరు, ప్రధాన కార్యదర్శి, జాయింట్ సెక్రటరీలు ఇద్దరు, కోశాధికారి ఈ విధానంలో కమిటీలు వేసుకుంటూ వెళ్తే బూత్ లెవెల్ లోనే కనీసంగా ఒక యాభై మంది దాకా క్యాడర్ కి పదవులు దక్కుతాయి, వారంతా అక్కడ పార్టీ సైన్యంగా ఉంటారు అని లెక్క వేస్తున్నారు. అక్కడ నుంచి వార్డు, అలాగే పంచాయతీ స్థాయి, మండలాలు, నియోజకవర్గాల దాకా ఈ కమిటీలు ఉంటాయి. దీంతో ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో కనీసంగా 15 వేలకు తక్కువ కాకుండా జగనన్న సైన్యం తయారు అవుతుందని అంటున్నారు.

**పదవ వంతుగా :**

ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటర్లు కనీసంగా లక్షన్నర నుంచి రెండు లక్షల మంది దాకా ఉంటారు. ఆ లెక్కన తీసుకుంటే అందులో పదవ వంతుగా వైసీపీ సైన్యం ఉంటారు అన్న మాట. ప్రతీ పది మంది ఓటర్లకు ఒక వైసీపీ కమిటీ మెంబర్ అన్నట్లుగా వైసీపీ అధినాయకత్వ ఈ రాజకీయ నిష్పత్తిని ఎంచుకుంది. వీరు కనీసంగా అయిదుగురిని పార్టీ వైపు మళ్ళించినా లేక పార్టీ పక్షాన ఉంచుకున్నా ప్రతీ నియోజకవర్గంలో ఎనభై వేల ఓట్లుగా మారుతాయని ఆ మీదట ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలతో మరి కొంత యాడ్ అవుతుందని అధినాయకత్వం చేపట్టే పాదయాత్ర వంటి వాటితో ఇంకా ఆ నంబర్ పెరుగుతుందని మొత్తానికి నికరంగా ఒక లక్ష దాకా ఓట్లను ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో ఉంచుకోగలిగితే ఎన్నికల్లో ఎదురు ఉండదని వైసీపీ పక్కా ప్లాన్ తోనే కమిటీల మీద ఫుల్ ఫోకస్ పెడుతోంది అని అంటున్నారు.

**జగన్ విజన్ ఇదే :**

తాజాగా విజయనగరంలో జరిగిన వైసీపీ విస్తృత స్థాయి సమావేశంలో మాజీ ఎమ్మెల్యే సీనియర్ నేత కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ జగన్ విజన్ ని ప్రతీ వారూ తెలుసుకోవాలని అన్నారు. పార్టీకి లాభం కలగాలని పార్టీ గెలవాలని ఆయన కమిటీలను ఏర్పాటు చేయమని గట్టిగా కోరుతున్నారని అన్నారు. జగన్ మాట వింటే పార్టీకి తిరుగు ఉండదని స్వామి చెప్పడం విశేషం. ప్రతీ నియోజకవర్గంలో జగనన్న సైన్యం పెద్ద ఎత్తున తయారు చేయమని అధినేత కోరుతున్నారని ఆయన అన్నారు. అంతా కష్టపడి కమిటీలను వేయాలని ఇక బూత్ లెవెల్ దాకా పార్టీని తీసుకుని వెళ్తే కనుక కచ్చితంగా మంచి ఫలితాలు ఉంటాయని చెప్పారు.

**క్యాడరే లీడర్ :**

మరో వైపు భీమిలీలో జరిగిన పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో వైసీపీ ఇంచార్జి మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ పార్టీ కమిటీలు అన్నీ పూర్తి అయిన తరువాత క్యాడర్ ని తప్పకుండా గుర్తుంచుకుంటామని చెప్పారు. అంతే కాకుండా వారికే అన్ని విధాలుగా పెద్ద పీట వేస్తామని అంటున్నారు. ఇక కార్యకర్తలు అందరికీ ఐడెంటిటీ కార్డుతో పాటు ఇన్సూరెన్స్ కూడా చేయిస్తామని ఆయన చెప్పారు. అధినాయకత్వం క్యాడర్ కే అగ్ర తాంబూలం అని చెబుతోందని అందువల్ల పార్టీ అధికారంలోకి వస్తే క్యాడరే లీడర్ అని వైసీపీ నేతలు చెబుతున్నారు.

# అమెరికాలో మంచు తుపాను విలయతాండవం...

- మొదటి పేజి తరువాయి

దాదాపు 20 కోట్ల మందికి పైగా ప్రజలు శీతల వాతావరణం, మంచు హెచ్చరికల నీడలో జీవిస్తున్నారు. పరిస్థితి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని వాషింగ్టన్ డీసీతో పాటు అలబామా, జార్జియా, కెంటకీ, న్యూయార్క్, టెక్సాస్ సహా 16కు పైగా రాష్ట్రాలు ఇప్పటికే 'స్టేట్ ఆఫ్ ఎమర్జెన్సీ'ని ప్రకటించాయి.

ఆర్కిటిక్ ప్రాంతం నుంచి పోలార్ వోర్టెక్స్ కారణంగా దూసుకొస్తున్న అతి శీతల గాలులు, శక్తివంతమైన తుపాను వ్యవస్థతో కలవడంతో ఈ విపత్కర పరిస్థితి ఏర్పడింది. దీని ఫలితంగా దేశంలోని తూర్పు భాగమంతా భారీ హిమపాతం, గడ్డకట్టే వర్షం (ఫ్రీజింగ్ రెయిన్), స్లీట్ (మంచుతో కూడిన వర్షం)తో అల్లకల్లోలంగా మారింది. ముఖ్యంగా సదరన్ ప్లెయిన్స్, లోయర్ మిసిసిపీ వ్యాలీ, టెన్నెస్సీ వ్యాలీ, ఆగ్నేయ రాష్ట్రాల్లో కొన్నిచోట్ల "విపత్తు స్థాయి"లో మంచు పేరుకుపోయే ప్రమాదం ఉందని జాతీయ వాతావరణ సేవల విభాగం (టీబో) హెచ్చరించింది. "ఇది చాలా తీవ్రమైన తుపాను" అని యూఎస్ వెదర్ ప్రిడిక్షన్ సెంటర్ వాతావరణ శాస్త్రవేత్త జాకబ్ ఆషర్‌మాన్ అభివర్ణించారు. ఈ మంచు తుపాను కారణంగా దేశవ్యాప్తంగా జనజీవనం పూర్తిగా స్తంభించిపోయింది. విమాన ప్రయాణాలపై తీవ్ర ప్రభావం పడింది. ఫ్లైట్ అవేర్ డేటా ప్రకారం, ఈ వారాంతంలో (శని, ఆదివారాలు) ఇప్పటివరకు 8,000కు పైగా విమానాలను రద్దు చేశారు. డెల్టా, అమెరికన్, యునైటెడ్ ఎయిర్‌లైన్స్ వంటి ప్రధాన సంస్థలు ప్రయాణ హెచ్చరికలు జారీ చేసి, టికెట్ మార్పు రుసుములను రద్దు చేశాయి. ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ కూడా టెక్సాస్ నుంచి ఈశాన్య రాష్ట్రాల వరకు పలు విమానాశ్రయాల్లో కార్యకలాపాలు నిలిచిపోవచ్చని హెచ్చరించింది. మంచు ప్రభావం కేవలం ప్రయాణాలకే పరిమితం కాలేదు. గడ్డకట్టే వర్షం కారణంగా విద్యుత్ తీగలపై అంగుళం మందం వరకు మంచు పేరుకుపోయే ప్రమాదం ఉంది. దీనివల్ల విద్యుత్ లైన్లు తెగిపోయి, చెట్లు కూలిపోయి సుదీర్ఘకాలం పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడవచ్చని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. టెక్సాస్‌లో ఇప్పటికే దాదాపు 20,000 మంది, ఓక్లహోమా, ఆర్కాన్సాస్‌లలో వేలాది మంది విద్యుత్ లేకుండా ఇబ్బందులు పడుతున్నారు. 2021 నాటి విద్యుత్ సంక్షోభం నుంచి పాఠాలు నేర్చుకున్నామని, ఈసారి విద్యుత్ గ్రిడ్‌ను సిద్ధంగా ఉంచామని టెక్సాస్ అధికారులు చెబుతున్నారు.

ప్రభుత్వ యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తమైంది. ఫెడరల్ ఎమర్జెన్సీ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ (ఫీజుహీూ) దాదాపు 30 సహాయక బృందాలను సిద్ధంగా ఉంచింది. ఆహారం, దుప్పట్లు, జనరేటర్లను కీలక ప్రాంతాలకు తరలించింది. పలు రాష్ట్రాల్లో నేషనల్ గార్డ్ దళాలను మోహరించారు. వాషింగ్టన్ డీసీ మేయర్ మురియల్ బౌజర్ మాట్లాడుతూ, "మేము అధికారికంగా స్నో ఎమర్జెన్సీ, స్టేట్ ఆఫ్ ఎమర్జెన్సీని ప్రకటించాం" అని తెలిపారు. చికాగోలో పాఠశాలలకు సెలవులు ప్రకటించగా, లూసియానాలో కార్నివాల్ పరేడ్‌లు, నాష్‌విల్లేలో పలు కార్యక్రమాలు రద్దయ్యాయి.

ఈ తుపాను సోమవారం వరకు కొనసాగి, న్యూయార్క్, బోస్టన్ వంటి ప్రధాన నగరాలపై ప్రభావం చూపనుంది. తుపాను తగ్గుముఖం పట్టినా, ఆ తర్వాత కూడా అత్యంత శీతల గాలులు, ప్రమాదకరమైన వాతావరణం కొనసాగుతుందని, ప్రజలు అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు.

# సినీ గ్లామర్ తో రాజకీయాల్లో విజయం సాధించడం సాధ్యం కాదు

- మొదటి పేజి తరువాయి

ఎన్నికలకు వెళ్లడం వల్లే ఇటీవల జరిగిన ఎన్నికల్లో విజయం సాధ్యమైందని ఆయన గుర్తుచేశారు.

ఇక జాతీయ రాజకీయాల విషయానికి వస్తే, ప్రస్తుతం దేశంలో సినీ స్టార్లను మించిన స్టార్ ప్రధాని నరేంద్ర మోదీ అని శ్రీనివాస్ వర్మ వ్యాఖ్యానించారు. మోదీ నాయకత్వంలోనే బీజేపీ దేశవ్యాప్తంగా బలపడుతోందని చెప్పారు. రాబోయే రోజుల్లో పశ్చిమ బెంగాల్, కేరళ, తమిళనాడు వంటి రాష్ట్రాల్లో కూడా బీజేపీ విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రాజకీయ పొత్తుల విషయంలో అగ్రనాయకత్వమే చర్చించి తుది నిర్ణయం తీసుకుంటుందని ఆయన స్పష్టం చేశారు.

మరోవైపు విశాఖ స్టీల్ ప్లాంట్ అంశంపై కూడా ఆయన స్పందించారు. స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం నిరంతరం సమీక్షలు నిర్వహిస్తోందని తెలిపారు. ఆర్థిక భారం తగ్గించే క్రమంలోనే సీఐఎస్ఎఫ్ బలగాల ఉపసంహరణ జరిగిందని వివరణ ఇచ్చారు. ఫిబ్రవరి 4న ఉక్కు శాఖ కార్యదర్శి విశాఖ స్టీల్ ప్లాంట్‌ను సందర్శించి అక్కడి పరిస్థితులపై సమీక్ష నిర్వహించనున్నారని వెల్లడించారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాపాడటానికి కేంద్ర ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని మరోసారి స్పష్టం చేశారు.

# భారత్ సంస్కరణల ఎక్స్‌ప్రెస్‌గా ఎదుగుతోంది

- మొదటి పేజి తరువాయి

మనదని ఆయన అన్నారు. దేశవ్యాప్తంగా 45 ప్రదేశాల్లో 18వ రోజ్‌గార్ మేళాను నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రధాని మోదీ వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారతదేశం సంస్కరణల దిశగా ముందుకు సాగుతోందని, ఇందుకోసం వివిధ దేశాలతో వాణిజ్య, మొబిలిటీ రంగాల్లో ఒప్పందాలు కుదుర్చుకుంటున్నామని తెలిపారు. తద్వారా భారతీయ యువతకు ప్రభుత్వం అనేక అవకాశాలను సృష్టిస్తోందని ఆయన అన్నారు. యువతకు ఉద్యోగం లక్ష్యంగా ప్రారంభమైన రోజ్‌గార్ మేళా కార్యక్రమం ఇప్పుడు ఒక సంస్థగా రూపాంతరం చెందిందని అన్నారు. రోజ్‌గార్ వేదికగా దేశంలోని లక్షలాది మంది ఉద్యోగాలు పొందారని

ఆయన వెల్లడించారు. యువతకు సరైన, సమగ్ర అవకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. అందుకు తమ ప్రభుత్వం నిబద్ధతతో పనిచేస్తోందని చెప్పారు. వివిధ దేశాలతో వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకుంటున్నామని, దీని ద్వారా దేశ, విదేశాల్లో ఉన్న భారతీయ యువతకు విస్తృత అవకాశాలు లభిస్తాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు.

# 40 ఏళ్లుగా గర్భం మోసిన మహిళ.. 82 ఏళ్ల వయసులో నొప్పులు.. కట్ చేస్తే!



మాతృత్వం అనేది పెళ్లి అయిన ప్రతి ఒక్క మహిళ కల. ఏడు నెలలు లేదా తొమ్మిది నెలలు మోసి పండంటి బిడ్డకు జన్మనిస్తుంది తల్లి. ఇక ఆ బిడ్డను అల్లారు ముద్దుగా అపురూపంగా చూసుకుంటూ జీవితం ధన్యం చేసుకుంటూ ఉంటుంది. అయితే ఇక్కడ ఒక మహిళ ఏడు కాదు తొమ్మిది కాదు ఏకంగా 40 ఏళ్ల పాటు గర్భవతిగా ఉండి.. చివరికి 82 సంవత్సరాల వయసులో నొప్పులు రావడంతో హాస్పిటల్ కి వెళ్ళింది. పరీక్షించిన వైద్యులు అసలు విషయం తెలుసుకొని ఆశ్చర్యపోయారు. మరి 40 ఏళ్ల పాటు ఆ తల్లి తన గర్భంలో బిడ్డను మోసి.. 82 సంవత్సరాల వృద్ధాప్యంలో నొప్పులు రావడం ఏంటి? ఇది నిజంగా నిజమేనా? కనీసం ఈ విషయం ఆమెకు కూడా తెలియలేదా? అని కొంతమంది ఆశ్చర్యపోతున్నారు. మరి అసలు విషయం ఏమిటో ఇప్పుడు చూద్దాం. సాధారణంగా కొన్ని కొన్ని సంఘటనలు నమ్మశక్యం కానీ నిజాలుగా మారుతున్న వేళ. ప్రతి ఒక్కరు ఆశ్చర్యంతో నోరెళ్ళబడుతున్నారు. అదెలా సాధ్యమనే ఆలోచనలో పడిపోతున్నారు. అలాంటి ఒక సంఘటనకు సంబంధించిన వార్త ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో అందరూ ఆశ్చర్యపోతున్నారు. అసలు విషయంలోకి వెళ్తే.. ప్రస్తుతం ఒక మహిళ వయసు 82 సంవత్సరాలు. ఒక్కసారిగా భరించలేని కడుపునొప్పి రావడంతో ఆమె కుటుంబ సభ్యులు ఆమెను హాస్పిటల్ కి తీసుకెళ్లారు. ఆమెను పరీక్షించిన వైద్యులు లోపల కణితి ఉంటుందని భావించారు. కానీ స్కానింగ్ తర్వాత అసలు విషయం తెలిసి ఆశ్చర్యపోయారు. కారణం ఆమె శరీరంలో 40 సంవత్సరాలకు పైగా ఒక కాల్సిఫైడ్ గర్భస్థ శిశువు ఉంది. అంటే 40 సంవత్సరాలుగా ఆమె గర్భవతి అన్నమాట. ఈ అరుదైన పరిస్థితిని వైద్య పరిభాషలో లిథోపెడియన్ లేదా స్టోన్ బేబీ అని పిలుస్తారు. అంటే గత 40 ఏళ్ల క్రితం ఆ మహిళకు ఎక్టోపిక్ గర్భం ఏర్పడిందట . అంటే గర్భస్థ శిశువు గర్భం లోపల కాకుండా గర్భం బయట అభివృద్ధి చెందడం.. దీని కారణంగానే ఆ మహిళకు పురిటి నొప్పులు అందరి లాగే రావడం , బిడ్డను కనడం వంటి పరిస్థితి ఎదురు కాలేదు.

పైగా ఈ సంక్రమణను నిరోధించడానికి అనుగుణంగా ఆమె శరీరం గర్భస్త శిశువును క్యాల్షియంతో ఆవరించి ఒక రక్షణ కవచాన్ని ఏర్పాటు చేసిందట. ఫలితంగా శిశువు గర్భాశయం వెలుపలి భాగంలో ఒక మమ్మీ సైడ్ రూపంగా మారి నిశ్శబ్దంగా ఉండిపోయింది. అందుకే ఎటువంటి గర్భస్థ లక్షణాలను కూడా కనబరచలేకపోయింది. నిజానికి ఇలాంటి సంఘటనలు చాలా అరుదుగా మాత్రమే జరుగుతాయట. వైద్య చరిత్రలో ఇప్పటివరకు కేవలం 300 కేసులు మాత్రమే గుర్తించినట్లు వైద్యులు తెలిపారు. ఇకపోతే ఈ విషయం ఎక్కడ? ఎప్పుడు? ఎవరిలో జరిగింది అనే పూర్తి వివరాలు మాత్రం లేవు. కానీ సోషల్ మీడియాలో మాత్రం ఈ వార్త వైరల్ అవ్వడంతో అందరూ ఆశ్చర్యపోతున్నారు. ఏది ఏమైనా ఇలాంటి సంఘటనలు అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తున్నాయి.

## బాలికల విషయంలో ఇప్పటికీ సమాజ దృక్పథంలో మార్పు రావాల్సి ఉంది

- మొదటి పేజి తరువాయి

ఆయన మాట్లాడుతూ... ఆడపిల్లలను కేవలం కాపాడుకోవడమే కాదు, వారిని ఉన్నత విద్యావంతులుగా, ఆత్మవిశ్వాసంతో ఎదిగేలా తీర్చిదిద్దాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, గురువులు, సమాజం అందరిపైనా ఉందన్నారు. బాలికల అక్రమ రవాణా, లైంగిక వేధింపులు వంటి వాటికి గురికాకుండా కాపాడటం అత్యంత కీలకమని చెప్పారు. బాలికల హక్కుల పరిరక్షణలో తల్లిదండ్రులు మాత్రమే కాదు... అధికారులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు కూడా భాగస్వాములేనని మంత్రి గుర్తు చేశారు. బాలికల భద్రత విషయంలో నిర్లక్ష్యం చోటు చేసుకోకూడదని హెచ్చరించారు.

## భారత్ పై తగ్గనున్న ట్రంప్ టారిఫ్ లు..!

- మొదటి పేజి తరువాయి

రష్యా నుంచి ఆయిల్ కొనుగోలు చేస్తున్నందుకు డొనాల్డ్ ట్రంప్ భారత్ పై 25 శాతం సుంకాలు విధించిన విషయం తెలిసిందే. ప్రతీకార సుంకాలు 25 శాతం కలిపి మొత్తంగా మన దేశంపై 50 శాతం సుంకాలు విధించారు. భారత్ నుంచి అమెరికాకు ఎగుమతయ్యే వస్తుసేవలపై ట్రంప్ ప్రభుత్వం 50 శాతం సుంకాలు వసూలు చేస్తోంది. అయితే, ఇటీవల రష్యా చమురు కొనుగోళ్లను భారత్ తగ్గించింది. దీంతో అమెరికా సుంకాలు సగానికి తగ్గే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ విషయాన్ని అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు.

## విదేశాల్లో భారత్ 'వాంటెడ్'.. రెండేళ్లలో 70 మంది గుర్తింపు

- మొదటి పేజి తరువాయి

ముమ్మరంగా కొనసాగుతుందని వెల్లడించింది. అదే సమయంలో ఇతర దేశాలు వెతుకుతున్న 203 మంది నిందితులు భారత్‌లో ఉన్నారని ఈ నివేదిక పేర్కొంది. పరారీలో ఉన్న వారిని విదేశాల్లో ఇంత పెద్ద మొత్తంలో గుర్తించడం గత దశాబ్ద కాలంలో ఇదే మొదటిసారి అని తెలిపింది.

వాంటెడ్ జాబితాలో ఉన్న వారిలో 27 మంది గత సంవత్సరం విదేశాల నుంచి తిరిగి వచ్చారని భారత ప్రభుత్వం వెల్లడించింది. సీబీఐ కేసులకు సంబంధించి ఏడాది వ్యవధిలో 74 రొగేటరీ లెటర్స్ పంపించినట్లు తెలిపింది. దర్యాప్తునకు సహకరించాలని విదేశీ న్యాయస్థానాలకు రాసే లేఖను రొగేటరీ లెటర్స్ అంటారు. ఈ లేఖల్లో 54 సీబీఐ, మరో 20 రాష్ట్ర దర్యాప్తు బృందాలు రాసినట్లు పేర్కొంది.

## మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ... ఇద్దరు మావోలు అరెస్ట్

- మొదటి పేజి తరువాయి

ఇన్ స్ట్రక్టర్ మీసాల సాల్మన్ అలియాస్ సంతోశ్ నాగరాజు, డీవీసీఎం అయిన ఆయన భార్యను నాగర్ కర్నూలు పోలీసులు అరెస్ట్ చేశారు. అచ్చంపేటకు వచ్చిన వీరు... మావోయిస్టు ఫ్రంట్ సంస్థల నేతల సాయంతో మావోయిస్టు కార్యకలాపాలను తిరిగి పునరుద్ధరించేందుకు ప్రయత్నిస్తుండగా పోలీసులు అరెస్ట్ చేశారు. వీరితో పాటు మహబూబ్ నగర్, నల్లమల ప్రాంతాల్లో మావోయిస్టులకు సహకరిస్తూ, వారికి ఆశ్రయం కల్పిస్తున్న మరో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వీరిలో సివిల్ లిబర్టీస్ కమిటీ జాయింట్ సెక్రటరీ జక్క బాలయ్య, తెలంగాణ ప్రజాఫ్రంట్ కో-కన్వీనర్ ఎడ్ల అంబయ్య, మంశెట్టి యాదయ్య ఉన్నారు. ఎర్టిగా కారులో మన్ననూరు నుంచి అచ్చంపేటకు వెళుతున్న సమయంలో వీరిని అరెస్ట్ చేసినట్టు పోలీసులు తెలిపారు.

## కూటమి పక్కన పెట్టింది...వైసీపీ షాక్ ఇచ్చేసింది

వైసీపీ అధికారంలోకి వచ్చాక గ్రామ వార్డు సచివాలయాలను ఏర్పాటు చేసింది. అంతే కాదు ఏకంగా రెండు లక్షల డెబ్బై వేల మంది దాకా వాలంటీర్లను తీసుకుంది. వీరికి గౌరవ వేతనంగా అయిదు వేల రూపాయలను ఇచ్చింది. వీరిని ప్రతీ యాభై కుటుంబాలకు బాధ్యులుగా చేసింది. ఆ విధంగా వీరు తమకు రాజకీయంగా ఉపయోగపడతారు అని భావించింది. కానీ విషయం చూస్తే మొత్తానికి మొత్తం బూమరాంగ్ అయింది.

**రెండింటికీ చెడి :**

వాలంటీర్లను తీసుకుని వచ్చి వైసీపీ పార్టీ నాయకులను క్యాడర్ ని పూర్తిగా పక్కన పెట్టేసింది. అన్నీ వారే చూస్తారు అని ధీమా పడింది. తీరా ఎన్నికల సమయంలో ఈసీ తీసుకున్న నిర్ణయంతో వాలంటీర్లు అంతా సైడ్ అయిపోయారు. మరో వైపు కూటమి నేతలు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వారు వైసీపీని వదిలేసి ఆ వైపుగా పనిచేసారు. కూటమి అధికారంలోకి వస్తే పది వేల రూపాయల గౌరవ వేతనం ఇస్తామని ఇచ్చిన హామీతో వైసీపీని వారే ఓడించేశారు. ఇలా వైసీపీ వ్యూహాలు రెండిందాలుగా చెడిపోయి ఎన్నడూ లేని విధంగా భారీ పరాజయాన్ని మూటకట్టుకుంది.

**కొన్నాళ్ళు ఆందోళన :**

వాలంటీర్లు అయితే కూటమి అధికారంలోకి వచ్చిన కొత్తల్లో కొన్నాళ్ళ పాటు ఆందోళనలు నిర్వహించారు. తమకు పది వేల రూపాయల వేతనం ఇస్తామని చెప్పారని తమను విధులలోకి తిరిగి తీసుకోవాలని వారు కోరారు. అయితే వారి సేవలను 2023 ఆగస్టు నుంచే వైసీపీ ప్రభుత్వం రెన్యూవల్ చేయలేదని టెక్నికల్ సాకులు చూపించి కూటమి ప్రభుత్వం పక్కన పెట్టేసింది. అదే సమయంలో నెలవారీగా అందించే సామాజిక పెన్షన్లను కూడా సచివాలయ ఉద్యోగుల చేత అందిస్తోంది. ఈ క్రమంలో వాలంటీర్ల సేవలు అందడం లేదని ఎవరూ అనుకోవడం లేదు, క్రమంగా వారి గురించి కూడా అంతా మరచిపోయారు.

పెన్ పవర్
మార్కాపురం - ప్రకాశం

ఇక నుండి ప్రతి శనివారం అన్నా క్యాంటీన్ లో స్వీట్‌తో

# నాణ్యమైన భోజనం

## తొలిసారిగా గిద్దలూరు నుండే ప్రారంభం

## పలావు, కుర్మాతో మెనూ ఎమ్మెల్యే ముత్తుముల







గిద్దలూరు పెన్ పవర్ జనవరి 24

గిద్దలూరులోని అన్నా క్యాంటీన్ లో నిత్యం ఒకే రకమైన నాణ్యమైన భోజనం వడ్డిస్తున్నారు. కానీ ఇకనుండి ప్రతి శనినివారం పేద ప్రజలకు వడ్డించే ఆహారంలో మార్పు చేసి పలావు, కుర్మా , తోపాటు ఏదోఒక స్వీట్ అదే రు 5 /-లకు వడ్డించి పేదల ఆకలి తీర్చనున్నట్లు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి పేర్కొన్నారు పేదల ఆకలిని తీర్చే అన్నా క్యాంటీన్ నూతన ఒరవడికి శ్రీకారం చుట్టిందన్నారు, అదికూడా శనివారం నుండి గిద్దలూరు నుండే ప్రారంభించడం మన అదృష్టమన్నారు ఆకలితో ఎవ్వరూ అలమటించ రాదనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అన్నా క్యాంటీన్ పథకం పేదల జీవితాల్లో ఆకలి మంటలను చల్లార్చిందని,. అన్న క్యాంటీన్ ద్వారా కేవలం రు 5/-ల అత్యంత తక్కువ ఖర్చుతో నాణ్యమైన, శుభ్రమైన, పోషకాహారం అందించడం ఈ పథకానికి ప్రధాన లక్ష్యం అన్నారు .నిత్యం వందలాది మంది కూలీలు, కార్మికులు, వృద్ధులు, నిరుపేద కుటుంబాలు ఈ సేవలను వినియోగించుకుంటూ ప్రభుత్వంపై విశ్వాసం పెంచుకుంటున్నారన్నారు. రోజువారీ ఉపాధిపై ఆధారపడే కార్మికులకు అన్న క్యాంటీన్ అండగా ఆశ్రయమిస్తుందన్నారు ఇక ప్రతి. శనివారం గిద్దలూరు అన్న క్యాంటీన్లో మన రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా నిత్యా భోజనంతో పాటు ప్రత్యేకంగా ఒక స్వీట్ కూడా వడ్డిస్తారని ఎమ్మెల్యే అశోక్ రెడ్డి తెలుపుతూ స్వీట్ తానే వడ్డించి పథకాన్ని ప్రారంభించారు . ఈ సందర్భంగా అన్న క్యాంటీన్లో అశోక్ రెడ్డి పేద ప్రజలతో కలిసి భోజనం చేశారు.ఇదేసందర్భంగా క్యాంటీన్లో అందుతున్న సేవలు భోజన నాణ్యత పై ప్రజాలనడిగి తెలుసుకున్నారు. అనంతరం అశోక్ రెడ్డి మాట్లాడుతూ ఇది పేదల పట్ల ప్రభుత్వానికి ఉన్న నిబద్ధత , మానవీయ దృక్పదం తో చేస్తునపథకామని ప్రజలు భావిస్తున్నారు. అన్న క్యాంటీన్ పథకం కేవలం భోజనం అందించే కార్యక్రమం మాత్రమే కాదు; ఇది పేదల గౌరవాన్ని కాపాడే సామాజిక భద్రతా వ్యవస్థగా మారిందన్నారు. ఆకలి సమస్యను తగ్గించడంలో, ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో, పేదల జీవన ప్రమాణాలను పెంచడంలో ఈ పథకం కీలక పాత్ర పోషిస్తోందని రాష్ట్ర వ్యాప్తంగా అమలవుతున్న అన్న క్యాంటీన్ కార్యక్రమం పేదల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకుందన్నారు. భవిష్యత్తులో మరింత మెరుగులు దిద్దుకుంటుందని, ఇంకా మరికొన్ని ప్రాంతాల్లో అన్నాక్యాంటీన్ల ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం ప్రణాళిక రూపొందిస్తుదన్నారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు కమిషనర్ రమణబాబు, చైర్మన్ వెంకటసుబ్బయ్య, కౌన్సిలర్లు టిడిపి కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం తోడ్పాటు

## - జిల్లా కలెక్టర్ పి రాజాబాబు






కలెక్టరేట్ ఒంగోలు ,పెన్ పవర్ జనవరి 24

పారిశ్రామిక అభివృద్ధి ప్రభుత్వ సహకారం జిల్లాలో పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు తెలిపారు. శనివారం ఉదయం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని ఆయన ఛాంబర్లో గతేడాది నవంబర్ విశాఖపట్నంలో జరిగిన పార్టనర్షిప్ సమ్మిట్లో ప్రకాశం, మార్కాపురం జిల్లాలో పరిశ్రమల ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వంతో ఎంఓయులు చేసుకున్న పారిశ్రామిక వేత్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జిల్లాలో సిబిజీ ప్లాంట్స్ ఏర్పాటుకు భాగస్వామ్య పెట్టుబడుల సదస్సులో ప్రభుత్వం తో ఒప్పందం చేసుకున్న అతిరథ్ హోల్డింగ్స్ సంస్థ చైర్మన్ బాలకృష్ణన్తో జిల్లా కలెక్టర్ పి రాజాబాబు మాట్లాడుతూ ప్రకాశం జిల్లా గుండ్ల సముద్రం, చీమకుర్తి, దర్శి, పొదిలి ప్రాంతాలలో 20 టన్నుల కెపాసిటీ గల సిబిజీ ప్లాంట్ ఏర్పాటుకు అవసరమైన అనుమతులు, ప్రాజెక్టుకు కావాల్సిన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం సహాయ, సహకారాలు ఉంటాయని, త్వరితగతిన ప్లాంట్ ఏర్పాటు చేసినందుకు పనులు వేగవంతం చేయాలని కోరారు. అదే విధంగా ప్రకాశం, మార్కాపురం జిల్లాలో నెలకొల్పే సిబిజి పరిశ్రమలకు సంబంధించిన పారిశ్రామిక వేత్తలతో పరిశ్రమలకు అనుకూలంగా ఉండే భూముల సమాచారం అందించాల్సిందిగా కనిగిరి, మార్కాపురం ఆర్డిఓలను కలెక్టర్ ఆదేశించారు. భారత్ డైనమిక్స్ లిమిటెడ్ వారు దొనకొండలో 1400 ఎకరాలలో ఏర్పాటు చేసే పరిశ్రమకు సంబంధించిన భూములను త్వరితగతిన పరిశీలించి వారికి అందించాల్సిందిగా ఏపిఐఐసి అధికారులను ఆదేశించారు. నెడ్క్యాప్ వారిని నోడల్ అధికారులుగా నియమించి పరిశ్రమలకు ప్రభుత్వం నుండి ఎలాంటి సహకారం అయినా వెంటనే అందించాల్సిందిగా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఇక నుంచి జిల్లాలో ఏర్పాటు చేయబోయే పరిశ్రమల కు సంబంధించి ప్రతి 10 రోజులకు ఓ పర్యాయం ప్రత్యేక సమీక్ష నిర్వహించి త్వరితగతిన ప్రాజెక్టులు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడతామన్నారు. పరిశ్రమలు నెలకొల్పే పారిశ్రామిక వేత్తలకు ప్రభుత్వం నుంచి ఏ అవసరం ఉన్నా వెంటనే వాటిని పరిష్కరించి జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు తమ అధికారులు వేగంగా పని చేస్తారన్నారు. ఎలాంటి సమస్యలున్నా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో అతిరథ్ హోల్డింగ్స్ సంస్థ ఛైర్మన్ బాలకష్ణన్, ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ చంద్రశేఖర్, భారత్ డైనమిక్స్ ప్రయివేటు లిమిటెడ్ కంపెనీ, ఎపి సన్రైజ్ ఎనర్జీ ప్రయివేటు లిమిటెడ్ కంపెనీ, ఎస్పైచ్ ఫుడ్ ప్రాసెసింగ్ ప్రయివేటు లిమిటెడ్ కంపెనీ, సూర్య స్టోన్ ఎంటర్ ప్రైజెస్ లిమిటెడ్, శ్రీ కామాక్షి బయో గ్యాస్ ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీలకు సంబంధించిన ప్రతినిధులు, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ శ్రీనివాసరావు, ఏపిఐఐసి, నెడ్క్యాప్ కార్యాలయ సిబ్బంది హాజరయ్యారు.

# స్వచ్ఛ సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలి

## - జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు పిలుపు



స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ జనవరి 24

ఆత్మ గౌరవాన్ని ఇచ్చేది శుభ్రత మాత్రమేనని, ఆ శుభ్రతను ప్రతి ఒక్కరూ పాటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన స్వచ్ఛ సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు పిలుపునిచ్చారు. శనివారం సంతనూతలపాడు నియోజకవర్గం, మద్దిపాడు మండల కేంద్రంలో జరిగిన స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి రాజాబాబు , శాసన సభ్యులు బిఎన్ విజయ కుమార్ తో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యర్థాల సేకరణ కోసం ఉద్దేశించిన స్వచ్ఛ రథాన్ని, మద్దిపాడు రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో కూరగాయలు, పప్పు దినుసులు, సుగంధ ద్రవ్యాలు, తృణ ధాన్యాలు, సిరి ధాన్యాలు, పండ్లును క్షేత్రస్థాయిలో అమ్ముకునేలా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ సహకారం తో 12లతో మంజురైన మినీవ్యాన్ ను జిల్లా కలెక్టర్ రాజాబాబు, శాసన సభ్యులు విజయకుమార్ తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమంలో భాగస్వాములై గ్రామాలను చెత్త రహితంగా తీర్చిదిద్దేలా కృషిచేయాలన్నారు. గ్రామాలు, పట్టణాలు పరిశుభ్రతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ నెలా మూడో శనివారం ప్రత్యేకమైన థీమ్ తో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించడం జరుగుచున్నదన్నారు. రాష్ట్రాన్ని పరిశుభ్రత కలిగిన రాష్ట్రంగా దేశంలో మొదటి స్థానంలో నిలిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నందని, ప్రజలు కూడా ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలన్నారు. పరిశుభ్రమైన పరిసరాలు, హరిత వాతావరణం ఉన్నప్పుడే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందన్నారు. పరిశుభ్రత విషయంలో అందరి ఆలోచనలూ మారాలని, ఇల్లు ఒక్కటే కాదు మన పరిసరాలు కూడా శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా ప్రజలకు సూచించారు. పరిసరాల పరిశుభ్రత, స్వచ్ఛతలో మద్దిపాడు గ్రామం ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలవాలన్నారు. సహజ వనరులతో పండించిన ఉత్పత్తులను క్షేత్ర స్థాయిలో అమ్మేలా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ సహకారంలో మద్దిపాడు రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో మంజురైన వ్యాన్ ను నేడు ప్రారంభించుకోవడం జరిగిందని, రాష్ట్ర ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రతి సంవత్సరం జనవరి 24న జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. సమాజంలో బాలికల సంరక్షణ, హక్కులు, ఆరోగ్యం, విద్య, సామాజిక ఎదుగుదల మొదలైన అంశాలపై ప్రతి ఒక్కరూ భాద్యతతో తమ వంతు తోడ్పాటు అందిస్తూ వారిని ప్రోత్సహించాలన్నారు. శాసన సభ్యులు బిఎన్ విజయ కుమార్ మాట్లాడుతూ, స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. స్వచ్ఛత ప్రతీఒక్కరి జీవితంలో భాగం కావాలని పిలుపునిచ్చారు. పరిసరాల పరిశుభ్రత, స్వచ్ఛత గురించి ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకే ప్రతీనెలా 3వ శనివారం స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతీనెలా ఒక ముఖ్యమైన అంశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఇంటి నుండి వేరు చేసిన తడి చెత్త, పొడి చెత్తను సంపద సృష్టించేలా చర్యలు తీసుకోవడం జరుగుచున్నదన్నారు. ప్రజలు కూడా స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగస్వాములై స్వర్ణాంధ్ర ప్రదేశ్ కలలను సాకారం చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత మద్దిపాడు లో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరిగిందన్నారు. 5 కోట్ల రూపాయలతో సిసి రోడ్ల నిర్మాణాలు చేపట్టడం జరిగిందని, రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని, ప్రజల సంక్షేమం, గ్రామాల అభివృద్దే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలచే స్వచ్ఛంధ్ర - స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. తొలుత జిల్లా కలెక్టర్, శాసన సభ్యులు మద్దిపాడులో జీరో గ్యాప్ సానిటేషన్ ఆంధ్ర థీమ్ తో ఇంటి వద్ద కంపోస్టింగ్ (సస్టైనబుల్ సానిటేషన్ అండ్ వేస్ట్ మేనేజ్మెంట్) పై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సిఈఓ చిరంజీవి, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర రావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. వెంకటేశ్వర యో, డ్వామా పిడి జోసెఫ్ కుమార్, మండల ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ రాజాబాబు, శాసనసభ్యులు తో కలసి గుండ్లకమ్మ ప్రాజెక్టు ను సందర్శించి ఇన్ టెక్ వేర్ మరియు పంపు హౌస్ ను పరిశీలించారు.





# ప్రతి ఎస్సీ కాలనీలో వాటర్ ప్లాంట్

## -రెండేళ్లలో ఏర్పాటు చేస్తా -ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు హామీ

## -లింగసముద్రంలో వాటర్ ప్లాంట్ ప్రారంభించిన ఎమ్మెల్యే





కందుకూరు పెన్ పవర్, జనవరి 24:

నియోజకవర్గంలోని ప్రతి ఎస్సీ కాలనీలో రాబోయే రెండేళ్లలో వాటర్ ప్లాంట్ లు ఏర్పాటు చేస్తామని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ప్రకటించారు. ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్య అనేది లేకుండా చేస్తామని స్పష్టం చేశారు. లింగసముద్రం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో ఐటీసీ సహకారంతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ ను ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు శుక్రవారం రాత్రి ప్రారంభించారు. అక్కడే మంత్రి లోకేష్ పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ నియోజకవర్గంలోని అనేక ఎస్సీ కాలనీలకు రకరకాల కారణాలవల్ల నీరు పూర్తిస్థాయిలో అందడం లేదన్నారు. వాటిని దృష్టిలో ఉంచుకొని ప్రతి ఎస్సీ కాలనీలో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడానికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే చెప్పారు. ఇప్పటికే ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి , ఐ టి సి ఆధ్వర్యంలో పలు కాలనీలో వాటర్ ప్లాంట్ లు ఏర్పాటయ్యాయన్నారు. మంత్రి నారా లోకేష్ పుట్టినరోజు సందర్భంగా పుట్టినరోజున స్థానిక ఎస్సీ కాలనీలో ప్లాంట్ ప్రారంభించడం ఆనందంగా ఉందని ఎమ్మెల్యే నాగేశ్వరరావు అన్నారు. గ్రామంలో స్మశానాలు, పొలాలకు వెళ్లే రోడ్ల వెంబడి చెత్తాచెదారాలు తొలగించి పరిశుభ్రం చేయాలని ఎమ్మెల్యే నాగేశ్వరరావు స్థానిక అధికారులను ఆదేశించారు. అలాగే కాలనీకి సంబంధించి రెవెన్యూ సమస్యలు ఎక్కువగా ఉన్న సంగతి తనకు తెలుసని, త్వరలోనే అవన్నీ పరిష్కారం అవుతాయని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. గత ప్రభుత్వంలో లింగసముద్రం మండలంలో విచ్చలవిడిగా రెవెన్యూలో అవినీతి జరిగిందని, కొందరు రికార్డులను తారుమారు చేసి ప్రజలను ఇబ్బంది పెట్టారని అన్నారు. సీనియర్ అధికారులు ఇక్కడ నియమించి ఆ సమస్యలన్నీ త్వరలోనే పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే నాగేశ్వరావు వివరించారు. లింగసముద్రం నుంచి వలేటివారిపాలెం మధ్య రోడ్డు రిపేర్లు వీటి వల్ల మూడు కోట్లు మంజూరయ్యాయని ఎమ్మెల్యే గుర్తుచేస్తూ ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా డబుల్ రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే చెప్పారు. ఇప్పటికే చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్లి నిధులు మంజూరుకు అభ్యర్థించాను అన్నారు. సీఎం కూడా అందుకు అంగీకరించారని త్వరలోనే డబుల్ రోడ్డు పనులు మొదలవుతాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పూరిమిట్ల గురునాథం, ప్రధాన కార్యదర్శి అడపా రంగయ్య, గ్రామ పార్టీ అధ్యక్షులు గాలంకి ప్రసాద్, వంకాయలపాటి మాల్యాద్రి, మాజీ ఎంపీపీ పూరిమిట్ల బాలకోటయ్య, బింకం శేషయ్య, ఉమ్మడిశెట్టి నాగేశ్వరరావు, ఉమ్మడిశెట్టి శ్రీను, చిరుతోటి బాలకోటయ్య, ప్రభావతి, నియోజకవర్గ ఎస్సి సెల్ అధ్యక్షులు పూరిమిట్ల మాల్యాద్రి, మద్దెల రామారావు, బొల్లినేని రమణయ్య, అత్తంటి రంగయ్య, జంపాల కృష్ణయ్య, అడపా నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.

# పరిశుభ్రత అలవాట్లు పెంచుకోండి

-పరిసరాలు చక్కగా ఉంటే అంతా ఆరోగ్యమే -విద్యార్థినులకు సూచించిన ఎమ్మెల్యే నాగేశ్వరరావు

-కందుకూరులో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే -బాలికల హాస్టల్ పరిశీలన






**కనుకూరు పెన్ పవర్, జనవరి 24**

వ్యక్తిగత శుభ్రతతో పాటు, చుట్టుపక్కల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా అలవాటు చేసుకోవాలని కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు సూచించారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా కందుకూరు పట్టణంలోని ప్రభుత్వ బాలికల హాస్టల్ ను శనివారం ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. హాస్టల్లో వంటగది, బాత్ రూములు, వ్యర్థాలు వేరుచేయడం, హాస్టల్ గదులను ఎమ్మెల్యే పరిశీలించారు. పారిశుధ్యంపై విద్యార్థినులకు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. హాస్టల్ పరిసరాలన్నీ ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని, బాలికలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాలని వార్డెన్ కు సూచించారు. ఎమ్మెల్యే నాగేశ్వరరావు బాలికలతో మాట్లాడుతూ నారా లోకేష్ మంత్రిగా బాధ్యతలు చేపట్టాక హాస్టల్స్ రూపురేఖలు మార్చారని చెప్పారు. ఆహారం, పుస్తకాలు, కాస్మోటిక్, ఇతర వస్తువులన్నీ సకాలంలో అందిస్తున్నారని చెప్పారు. తల్లికి వందనం పథకాన్ని కూడా చదువుకునే పిల్లలందరికీ అమలు చేస్తున్నారని అన్నారు. ప్రస్తుతం ఉన్న హాస్టల్ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో త్వరలోనే కొత్త భవనాన్ని నిర్మించబోతున్నట్లు ఎమ్మెల్యే నాగేశ్వరరావు వెల్లడించారు. తాత్కాలికంగా నిర్మిస్తున్న భవనాన్ని ఎమ్మెల్యే పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. తరచుగా హాస్టల్ ను సందర్శించి, వసతులు గురించి బాలికలను అడిగి తెలుసుకోవాలని స్థానిక నేతలకు ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కే అనూష, మున్సిపల్ డి.ఈ గణపతి, హాస్టల్ వార్డెన్ రమాదేవి, చిలకపాటి మధుబాబు, పోకూరి రాంబాబు, చదలవాడ కొండయ్య, షేక్ రూబీ, షేక్ రఫీ, బెజవాడ ప్రసాద్, చుండూరి శ్రీనివాసరావు, షేక్ మున్నా, కల్లూరి శైలజ, పువ్వాడి మౌనిక, షేక్ సలాం, సవిడిబోయిన వెంకట కృష్ణ, ముచ్చు వేణు, గుమ్మా శివ, భవనాసి వెంకటేశ్వర్లు, అత్తింటి శివకృష్ణ, మచ్చ మనోహర్ సచివాలయ సిబ్బంది ఇతర నాయకులు పాల్గొన్నారు.

## సుచిత్ర ప్రమాణస్వీకారంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఇంటూరి



**కందుకూరు పెన్ పవర్ జనవరి 24**

ప్రకాశం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ముప్పవరపు సుచిత్ర ప్రమాణ స్వీకార కార్యక్రమం శుక్రవారం రాత్రి ఒంగోలులో జరిగింది. కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు హాజరై సుచిత్ర కి శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రంథాలయాల అభివృద్ధికి పాడుపడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గారి వెంట టిడిపి సీనియర్ నాయకులు నార్నె రోశయ్య, గొర్రెపాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా గ్రంథాలయంలో ఉచిత వై ఫైవ్ సేవలు

- ప్రారంభించిన గ్రంథాలయ సంస్థ చైర్మన్ ముప్పవరపు సుచిత్ర వీరయ్య చౌదరి




**కలెక్టరేట్ ఒంగోలు ,పెన్ పవర్ జనవరి 24**

ప్రకాశం జిల్లా గ్రంథాలయం లో ఉచిత వై ఫైవ్ ఇంటర్నెట్ కనెక్షన్ ను ప్రకాశం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ముప్పవరపు సుచిత్ర వీరయ్య చౌదరి ప్రారంభించారు. గ్రంథాలయానికి వచ్చే స్టూడెంట్స్ కు పాఠకులకు ఉచితంగా వై ఫైవ్ ని అందించాలని ముఖ్య ఉద్దేశంతో ఈ కార్యక్రమం ప్రారంభించారు. సంపూర్ణ కాళహస్తి ఫౌండేషన్ వారు ఉచిత వై ఫైవ్ ని అందిస్తున్నారు. నేటి నుండి విద్యార్థులకు ఉచిత వై ఫైవ్ అందుబాటులో ఉంటుందని గ్రంథాలయ కార్యదర్శి జీవి శివారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమం లో ఇన్చార్జి డిప్యూటీ లైబ్రేరియన్ సంపూర్ణ కాళహస్తి, అభివృద్ధి కమిటీ సభ్యులు, కొత్తపల్లి సోనీ బోను దుర్గ, చల్లా నాగేశ్వరమ్మ, డాక్టర్ మధుర శ్రీ, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ బాలుర హాస్టల్ ఆకస్మిక తనిఖీ.

ఎంపీడీవో వీరభద్రాచారి.



**పెన్ పవర్, కంభం జనవరి 24**

కంభం ఎస్సీ బాలుర హాస్టల్ 1 ను కంభం ఎంపీడీవో వీరభద్రా చారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. కంభం రావిపాడు రోడ్డు లోని ఎస్సీ బాలుర వసతి గృహం1 ఎంపీడీవో వీరభద్రాచారి శుక్రవారం రాత్రి ఆకస్మికంగా సందర్శించి 10వ తరగతి విద్యార్థులతో 100 డేస్ ప్రోగ్రాం గురించి మాట్లాడడం జరిగింది. పదవ తరగతి మీ జీవితమునకు పునాది లాంటిదని కనుక నూరు శాతం ఉత్తీర్ణత సాధించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. విద్యార్థులకు ఇంగ్లీషును బోధించి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం వంటగదిని నివాస గదులను టాయిలెట్స్ ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసారు. కొత్తగా నిర్మిస్తున్న కమ్యూనిటీ కాంప్లెక్స్ నిర్మాణాలను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు ఉదయం సాయంత్రం వసతిగృహం నందు స్టడీ అవర్స్ నిర్వహించి నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని హాస్టల్ వార్డెన్ కోటిరెడ్డి ని ఆదేశించారు.

## మర్రిపూడిలో బాలికల దినోత్సవ ర్యాలీ

**పొదిలి, పెన్ పవర్, జనవరి 24**

మండల కేంద్రమైన మర్రిపూడి గ్రామంలో బాలికల ప్రదర్శన జరిగింది. జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా శనివారం నాడు అంగన్వాడి కేంద్రాల కార్యకర్తల ఆధ్వర్యంలో జరిగిన బాలికల ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది. మరిపూడి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి ప్రారంభమైన బాలికల ప్రదర్శన బస్టాండ్ సెంటర్ వరకు సాగింది. ఈ సందర్భంగా ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సమాజంలో ఆడపిల్లల ప్రాముఖ్యత, వారి పాత్ర గురించి అవగాహన కల్పించేందుకు, సామాజిక స్పృహను పెంచేందుకు ఇటువంటి ప్రదర్శనలు ఎంతగానో తోడ్పడతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులతోపాటు అంగన్వాడి కేంద్రాలకు చెందిన కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




## ఆర్టీసీ బస్టాండ్‌లో 12 సీసీ కెమెరాలు ఏర్పాటు

-ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు చేతుల మీదుగా ప్రారంభం

-దాత పివిఆర్ ను అభినందించిన ఎమ్మెల్యే



**కందుకూరు పెన్ పవర్, జనవరి 24**

ఆర్టీసీ బస్టాండ్ లో కొత్తగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు శనివారం ఉదయం ప్రారంభించారు. పట్టణ టిడిపి మాజీ అధ్యక్షుడు పిడికిటి వెంకటేశ్వర్లు 90 వేల రూపాయలు ఖర్చు చేసి 12 సీసీ కెమెరాలు బిగించగా ఆయనను ఎమ్మెల్యే శాలువ కప్పి అభినందించారు. అంతకుముందు బస్టాండ్ కు విచ్చేసిన ఎమ్మెల్యే నాగేశ్వరరావుకు డిపో అధికారులు, కార్మిక సంఘాల నేతలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ పట్టణంలో అనేక సేవా కార్యక్రమాలకు దాతలు చేయూత అందించడం మంచి విషయమన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు వల్ల డిపోలో దొంగతనాలు తగ్గుముఖం పడతాయన్నారు. స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలు ఉచితంగా బస్సుల్లో ప్రయాణిస్తున్నారని, ఈ పథకం ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చి పెట్టిందని ఎమ్మెల్యే అన్నారు. ఈ పథకం అమలులో భాగంగా అనేక గ్రామాలకు బస్సు సర్వీసులు పొడిగించాల్సిన అవసరం ఉందన్నారు. తన మిత్రుడు, ఆర్టీసీ మంత్రి రాంప్రసాద్ రెడ్డి సహకారంతో కొత్త బస్సులు తీసుకురావడంతో పాటు డిపోలో అన్ని సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే నాగేశ్వరరావు తెలిపారు. డిపో అధికారులు కూడా ప్రయాణికులకు చక్కటి సేవలు అందిస్తూ ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే నాగేశ్వరావు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిఎం ఆర్ శ్రీనివాసులు, సిఐ ప్రసాద్, పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, పార్టీ నాయకులు ఉప్పుటూరి శ్రీనివాసరావు, చిలకపాటి మధుబాబు, పోకూరి రాంబాబు, చదలవాడ కొండయ్య, బెజవాడ ప్రసాద్, పువ్వాడి మౌనిక, కూనం నరేంద్ర, షేక్ రూబీ, షేక్ రఫీ, షేక్ మున్నా, షేక్ సలాం, గుమ్మ శివ, భవనాసి వెంకటేశ్వర్లు, సవిడిబోయిన వెంకటకృష్ణ, చుండూరి శ్రీనివాసరావు, మేడ మల్లికార్జున, కొత్తూరు సుధాకర్ ,వెంకట సుధీర్, మచ్చ మనోహర్, నల్లూరి సూర్యనారాయణ, నల్లూరి సుబ్బారావు, డి ఏడుకొండలు శివకృష్ణ, బెజవాడ నరేష్, ఎమ్ ఎన్ రెడ్డి, మాధవరావు లక్ష్మయ్య ప్రసాద్ నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

## మన్నేటికోట ఎస్టీ కాలనీలో మినరల్ వాటర్ ప్లాంట్

-ప్రారంభించిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు





**ఉలవపాడు పెన్ పవర్, జనవరి 24**

మండలంలోని మన్నేటికోట ఎస్టీ కాలనీలో ఐటీసీ సహకారంతో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్ ను కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు శుక్రవారం రాత్రి ప్రారంభించారు. కుళాయి తిప్పి, మహిళామణులకు బిందెలతో నీళ్లు అందించారు. అనంతరం అక్కడే కేక్ కట్ చేసి మంత్రి నారా లోకేష్ కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగేశ్వరావు మాట్లాడుతూ గత ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిన ప్రకారం, ఐటీసీ సహకారంతో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసి మాట నిలబెట్టుకున్నామని తెలిపారు. రాబోయే రెండు మూడు ఏళ్లలో నియోజకవర్గంలోని అన్ని ఎస్సీ, ఎస్టీ కాలనీలో మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలియజేశారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు మంత్రి నారా లోకేష్ భరోసాగా నిలుస్తున్నారని, అన్ని విధాలుగా కాపాడుకుంటున్నారని అన్నారు. ప్రతి ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుకుంటుంటే అంతమందికి తల్లుల ఖాతాల్లో తల్లికి వందనం నిధులు జమ చేస్తున్నారని ఎమ్మెల్యే వివరించారు. రాష్ట్ర భవిష్యత్తుకు చంద్రబాబునాయుడు తర్వాత లోకేష్ పెద్దదిక్కుగా మారారని ఆయన కొనియాడారు. కేక్ కటింగ్ అనంతరం మంత్రి నారా లోకేష్ కి హృదయపూర్వక పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మన్నేటికోట సర్పంచ్ పులివర్తి బసవయ్య నాయుడు, గోత్తుల జనార్ధన్, మందాడి రామారావు, రమేష్ నాయుడు, మోహన్, వెంకటసుబ్బయ్య, వెంకటేశ్వర్లు, పున్నయ్య, బెల్లం కృష్ణమోహన్, అమరనేని రాములు మండలంలోని పార్టీ అనుబంధ సంఘాల సభ్యులు గ్రామ పార్టీ అధ్యక్షులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఇంటి పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలి

**పొదిలి మునిసిపల్ కమిషనర్ మారుతి రావు**



**పొదిలి, పెన్ పవర్, జనవరి 24**

ఇంటి పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని పొదిలి నగర పంచాయతీ కమిషనర్ ఏ మారుతి రావు కోరారు. శనివారం నాడు స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో ఇంటి పన్నుల వసూళ్ల గురించి సచివాలయ సిబ్బందితో సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ మారుతి రావు మాట్లాడుతూ ఇంటి పన్నుల ను చురుగ్గా వసూలు చేయడం ద్వారా నగర పంచాయతీ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. ఇంటి పన్నుల పట్ల ప్రజల్లో సరైన అవగాహన కలిగించడం ద్వారా వసూళ్లను వేగవంతం చేయాలని కమిషనర్ మారుతి రావు సూచించారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ మేనేజర్ షేక్షావలి, సచివాలయ సిబ్బంది, మునిసిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఇంటికి దీపం ఆడపిల్ల... ఎంఈఓ భాస్కర్ రావు

**పుల్లల చెరువు పెన్ పవర్ జనవరి 24**

ఇంటికి దీపం ఆడపిల్ల అని ఎంఈఓ భాస్కర్ రావు అన్నారు.. శనివారం జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా స్థానిక జిల్లా కేజీబీవీ పాఠశాలలో విద్యార్థినులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ భాస్కరరావు మాట్లాడుతూ సమాజం పట్ల అవగాహన కల్పించారు. వివిధ రంగాల్లో అభివృద్ధి చెందిన మహిళల గురించి వివరించారు. భవిష్యత్లో ఎదురయ్యే సవాళ్లను ఏ విధంగా ఎదుర్కోవాలో, పౌష్టికాహార లోపంతో ఎదుర్కొనే సమస్యలు, ఎలాంటి పౌష్టికాహారం తీసుకోవాలో వెల్లడించారు. విద్యార్థినిలకు వ్యాస రచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ 2 ఇందిరా ప్రసాద్, అంగన్వాడి సూపర్వైజర్ సుజాత, ఉపాధ్యనీయులు, అంగన్వాడి కార్యకర్తలు, విద్యార్థినులు పాల్గొన్నారు.



## ఆనారోగ్యంతో బాధపడే వారికీ వరం ముఖ్యమంత్రి సహాయనిధి..

**గిద్దలూరు నియోజకవర్గంలోని 35 మందికి రూ. 26,53,244/- ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణి ఎమ్మెల్యే ముత్తుముల**

**గిద్దలూరు పెన్ పవర్ 24**

గిద్దలూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి శనివారం నాడు నియోజకవర్గంలో ఆనారోగ్యంతో బాధపడుతున్న 35 మందికీ 14 వ విడతగా మంజూరు అయిన, రూ,26,53,244/-లు ముఖ్యమంత్రి సహాయ నిధి, చెక్కులనులబ్ధిదారులకు అందచేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆనారోగ్యంతో బాధపడే వారికీ ముఖ్యమంత్రి సహాయనిధి అనేది ఒక వరం లాంటిదని , పేదలకు నాణ్యమైన వైద్యం అందించటమే ఎన్డీయే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ప్రస్తుతం పట్టణాల్లోని కార్పొరేట్ హాస్పిటల్స్ లో పేదలు నాణ్యమైన వైద్యం పొందవచ్చునని, వారికీ అయిన ఖర్చును ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారాపొందవచ్చు అని అనారోగ్య సమస్యలతో బాధపడుతూ అనేకమంది పేద ప్రజలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనుచున్నారని వారికీ అండగా నిలవాలన్నదే చంద్రన్న కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. పేద ప్రజలకు ఎటువంటి సమస్య వచ్చిన కూటమి ప్రభుత్వం తక్షణమే స్పందిస్తుందన్నారు. ఇప్పటి వరకు నియోజకవర్గంలోని 847 మంది నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ. 7,47,19,560 /- అందచేయటం జరిగిందన్నారు. ప్రభుత్వం చేసిన మంచిని ప్రతీ ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన ప్రతీ హామీని నెరవేరుస్తుందని రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమమే కూటమి ప్రభుత్వం తోనే సాధ్యమన్నారు ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు ,నాయకులు , కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రకాశంలో నేషనల్ గర్ల్ చైల్డ్ డే ఘనంగా నిర్వహణ






**కందుకూరు పెన్ పవర్, జనవరి 24:**
ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాల (స్వయంప్రతిపత్తి), కందుకూరులో నేషనల్ గర్ల్ చైల్డ్ డే వేడుకలను వుమెన్ ఎంపవర్మెంట్ సెల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం కళాశాల ఈ-క్లాస్ రూమ్లో జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కోర్రపాటి అనూష, కందుకూరు మున్సిపాలిటీ కమిషనర్ కళాశాల కరస్పాండెంట్ కంచర్ల విజయ్ శ్రీనివాస్ సతీమణి కంచర్ల ఇంద్రా దేవి హాజరయ్యారు. మున్సిపల్ కమిషనర్ అనూష మాట్లాడుతూ ఆడ శిశువు జననాన్ని ఆనందంగా స్వాగతించే సమాజమే నిజమైన అభివృద్ధి చెందిన సమాజం అని పేర్కొన్నారు. ఆడపిల్లల విద్య, భద్రత, సమాన అవకాశాలు ప్రతి కుటుంబం సమాజం బాధ్యత అని తెలిపారు. బాలికలపై జరిగే వేధింపులు, వివక్షను తగ్గించేందుకు చట్టాలు ఉన్నప్పటికీ, మన మనసుల్లో మార్పు రావాలని ఆమె స్పష్టం చేశారు. ధైర్యం, ఆత్మవిశ్వాసంతో అమ్మాయిలు ఏ రంగంలోనైనా అగ్రస్థానంలో నిలవగలరని ఆమె విద్యార్థినులను ప్రోత్సహించారు. అదేవిధంగా కంచర్ల ఇంద్రాదేవి మాట్లాడుతూ,ప్రోత్సాహక వాతావరణం, నైతిక విలువలు, భద్రత కలిగిన విద్యా వాతావరణం ఉంటే అమ్మాయిల ప్రతిభ వికసిస్తుంది అని అన్నారు. కుటుంబం, విద్యాసంస్థలు కలిసి బాలికల భవిష్యత్తును బలోపేతం చేయాలని, మహిళలపై వేధింపుల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని సూచించారు. లేడీ ఫ్యాకల్టీ విద్యార్థినులకు విద్యాబోధనతో పాటు వ్యక్తిత్వ వికాసానికి మార్గదర్శకులుగా ఉన్నారని అభినందించారు. ఈ సందర్భంగా కళాశాల తరఫున కంచర్ల ఇంద్రాదేవి, డా. కె. పావని లేడీ ఫ్యాకల్టీ సభ్యులు కలిసి ముఖ్య అతిథి కోర్రపాటి అనూషను సత్కరించారు. ఈ కార్యక్రమాన్ని వుమెన్ ఎంపవర్మెంట్ సెల్ ఇన్చార్జి, ఎంబీఏ విభాగాధిపతి డా. కె. పావని ఆధ్వర్యంలో నిర్వహించారు. కళాశాల లేడీ ఫ్యాకల్టీ సభ్యులు, బి.టెక్ విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## రజక సంఘం నేతలకు సముచిత స్థానం కల్పించిన కూటమి ప్రభుత్వం



**గిద్దలూరు పెన్ పవర్ జనవరి 24**
గిద్దలూరు పట్టణంలోనీ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పాలకపాటి బాలచన్నయ్య ఆహ్వానం మేరకు నంద్యాల, గిద్దలూరు నియోజకవర్గ రజక సంఘం నేతలు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి ని శనివారం కలిసి కూటమి ప్రభుత్వం రజక సంఘం రాష్ట్ర అధ్యక్ష పదవి సముచిత స్థానం కల్పించిన సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు రజకులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని ఇకపై ఎలాటి ఇబ్బందులు అవమానాలు జరగకుండా సముచిత స్థానం కల్పించాలని రజకు లను ఎస్సి జాబితాలో చేర్చాలని ఎస్సి ఎస్టీ యాక్ట్ వర్తించాలని, రజకుల రక్షణ కల్పించాలని కోరుతూ వినతి పత్రం అందించారు చివరగా ఎమ్మెల్యే ని శాలువా పూల మాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మజీరా సీడ్స్ అధినేత స్టేట్ బోర్డ్ మెంబర్ మద్దిలేటి, రజక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుబ్రమణ్యం, గొప్పాడ మండల ఉపాధ్యక్షుడు మద్దిలేటి,నాగరాజు, తిరుపాలు, నగేష్, సుమంత్, సునీల్, నాగయ్య, గిద్దలూరు రజక అభివృద్ధి సంఘ నాయకులు , పాలకవీటి బాల చెన్నయ్య రజక సంఘం అధ్యక్షులు, సలజాములు ఖాదరయ్య గుడి అధ్యక్షులు తిమ్మనపల్లి గురవయ్య, ఆరవీటి శివశంకర్, కొమరోలు శ్రీనివాసులు, కొమరోలు సుబ్బారావు అలసందలపల్లి పాండు, అలహాలపల్లి, రామాంజనేయులు సరెడ్డి రెడ్డిపల్లి పెద్ద గురయ్యా చిలక రంగస్వామి, చిలక రమణ ,చిలక శ్రీనివాసులు బోయిల పల్లి సురేష్, అలసందడి పల్లి పుల్లయ్య సంఘం కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పొదిలిలో స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణాంధ్ర ప్రదర్శన




**పొదిలి, పెన్ పవర్, జనవరి 24**
పొదిలిలో స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణ ఆంధ్ర ర్యాలీ జరిగింది. శనివారం నాడు పట్టణంలో జరిగిన ర్యాలీ ద్వారా ప్రజలకు పారిశుధ్యం పట్ల అవగాహన కలిగించారు. అలాగే ప్రజలు పాటించాల్సిన పరిశుభ్రత కార్యక్రమాలను కూడా ప్రదర్శకులు వివరించారు. అలాగే స్వచ్ఛత ప్రతిజ్ఞ కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ మారుతి రావు తో పాటు సిబ్బంది, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## పొదిలి మునిసిపల్ కమిషనర్ ను కలసిన శివాలయం చైర్మన్ వెంకట్రామయ్య



**పొదిలి, పెన్ పవర్, జనవరి 24**
పొదిలి నగర పంచాయతీ కమిషనర్ ఏ మారుతి రావు ను స్థానిక శివాలయం కమిటీ చైర్మన్ ఒగ్గు వెంకటరామయ్య కలిశారు. శనివారం నాడు నగర పంచాయతీ కార్యాలయంలో కమిషనర్ మారుతి రావు ను ఆయన మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా శివాలయం చైర్మన్ వెంకట్రామయ్య కమిషనర్ మారుతి రావు ను శాలువాతో సత్కరించి, తమ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పొదిలి మార్కెట్ కమిటీ డైరెక్టర్ సోమిశెట్టి శ్రీదేవి కూడా పాల్గొన్నారు.

## కూలీల ప్రాణాలతో చెలగాటం వద్దు: ఆటో డ్రైవర్లకు సీ.ఐ సుబ్బరాజు హెచ్చరిక

### రోడ్డు భద్రతపై అద్దంకి పోలీసుల కౌన్సెలింగ్





**అద్దంకి ఆర్సి ఇంచార్జ్, పెన్ పవర్ జనవరి 24:**
అద్దంకి పట్టణంలో రోడ్డు ప్రమాదాల నివారణే ధ్యేయంగా పోలీసులు శనివారం ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అద్దంకి టౌన్ సి.ఐ సుబ్బరాజు వాహనదారులకు రోడ్డు భద్రతా నియమాలపై కౌన్సెలింగ్ ఇచ్చారు. తనిఖీల్లో భాగంగా నిబంధనలకు విరుద్ధంగా, పరిమితికి మించి అధిక మంది కూలీలతో ప్రయాణిస్తున్న ఆటోను గుర్తించి, దానిని నిలిపివేసి జరిమానా విధించారు. అనంతరం సి.ఐ మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, అది "ఫ్యాషన్ కోసం కాదని, ప్రాణ రక్షణ కవచమని" స్పష్టం చేశారు. ముఖ్యంగా ఆటోల్లో సామర్థ్యానికి మించి కూలీలను ఎక్కించడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. నిబంధనలు ఉల్లంఘించే ఆటో డ్రైవర్లపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి పోలీసులకు సహకరించాలని, సురక్షిత ప్రయాణం చేయాలని ఆయన కోరారు.

## బాలికా చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలి

### - జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి షేక్ ఇబ్రహీం షరీఫ్



**క్రైమ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ జనవరి 24**
బాల్య వివాహాల నిరోధక చట్టం ఫోక్స చట్టం బాలల సంరక్షణకు సంబంధించిన చట్టాలు ఎన్నో ఉన్నాయని బాలికా చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండి సత్వర న్యాయం పొందాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి షేక్ ఇబ్రహీం షరీఫ్ పేర్కొన్నారు. జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా శనివారం పివిఆర్ బాలికల హై స్కూల్ నందు జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారిణి సువర్ణ, విద్యాశాఖ అధికారిణి రేణుక వారి సంయుక్త ఆధ్వర్యంలో వకృత్వ, చిత్రలేఖన, పద్య పాఠ్యాంశాల పై పోటీలు నిర్వహించారు. చిన్న వయసులో పెళ్లిళ్లు జరగడం వలన కలిగే నష్టాలను వాటి ద్వారా వచ్చే శారీరక మానసిక రుగ్మతలను ముఖ్య అతిథి న్యాయమూర్తి షేక్ ఇబ్రహీం షరీఫ్ వివరించారు. జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీమతి రేణుక బాలికలకు విద్యాశాఖ ద్వారా అందించబడే సేవలను, విద్యార్థినులకు వున్న ప్రత్యేక అవకాశాలను, ప్రభుత్వం కేజీబీవీ ద్వారా బాలికలకు విద్య అందిస్తున్నామని తెలిపారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిణి సువర్ణ ఈ శాఖ ద్వారా అందించే పలు సేవలను, కుటుంబ వ్యవస్థలో లోపాల వల్ల బాలికలు పడే ఇబ్బందులను వాటికి తీసుకోవలసిన జాగ్రత్తలను, చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ 1098 ద్వారా కలిగే ఉపయోగాలను తెలియజేశారు. స్టెప్స్ సీఈఓ శ్రీమన్నారాయణ మాట్లాడుతూ తాను కూడా ఈ స్కూల్ పూర్వ విద్యార్థినే అని వారు చదువుకున్న రోజులను గుర్తు చేసుకుంటూ అప్పటి పరిస్థితులను ఇప్పుడున్న పరిస్థితులను, బాలికలకు ఉన్న ప్రత్యేక అవకాశాలను వివరించారు. జిల్లా బాలల సంరక్షణ విభాగం న్యాయ, పరివీక్షణ అధికారి బి రత్న ప్రసాద్ 18 సంవత్సరాల లోపు వయసు గల వారికి గల రక్షణ సంరక్షణ అంశాలను వివరించారు. ఒంగోలు సిడిపిఓ కళ్యాణ వర్మ, ఏ సి డి పి ఓ వై అంజమ్మ, సూపర్వైజర్ అనురాధ, పిచ్చమ్మ, రమాదేవి, ఆదిలక్ష్మి, ఐసిడిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

## మద్యం సేవించి వాహనం నడిపిన 21 మందికి జరిమానా

### - ట్రాఫిక్ సిఐ ఎస్ జగదీష్




**క్రైమ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ జనవరి 24**
మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారిలో 21 మందిని స్థానిక కోర్టులో న్యాయమూర్తి ఎదుట హాజరు పరచగా వాహనదారులకు ఒక్కొక్కరికి రూ. 10,000/- లు చొప్పున మొత్తం రూ.2,10,000/-లు జరిమానా విధించారని ఒంగోలు నగర ట్రాఫిక్ సిఐ ఎస్ జగదీష్ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, హెల్మెట్ లేకుండా, సీట్ బెల్ట్ ధరించకుండా వాహనాలు నడపరాదని, ట్రిపుల్ డ్రైవింగ్ చేయరాదని, వాహనాలను అతి వేగంగా నడపరాదని, మైనర్ డ్రైవింగ్ చేయరాదని, వాహనదారులందరూ మోటార్ వెహికల్ యాక్ట్ ను పాటించాలని సిఐ సూచించారు.

## నగరాభివృద్ధి లో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర కీలకం - ఎమ్మెల్యే దామచర్ల







**కార్పొరేషన్ పెన్ పవర్ , ఒంగోలు జనవరి 24**
నగర అభివృద్ధిలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర చాలా కీలకమని ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ రావు అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణ ఆంధ్ర కార్యక్రమాన్ని పురస్కరించుకొని ఒంగోలు నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో మునిసిపల్ కార్యాలయం నందు పారిశుద్ధ్య కార్మికులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి కమిషనర్ డాక్టర్ కోడూరి వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికుల పనితీరు వలన మెంథా తుఫాన్ ను సమర్ధవంతంగా ఎదుర్కున్నామని అన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు ఏ కష్టం వచ్చినా తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు కార్మికులు తమ ఆరోగ్యం గురించి తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. తన సొంత నిధులతో పారిశుధ్య కార్మికులందరికీ ఇన్సూరెన్స్ సౌకర్యాన్ని కల్పిస్తామని హామీ ఇచ్చారు. పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ప్రజలు హర్షించే విధంగా పనితీరు ఉండాలని ఆయన కోరారు. మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెల మూడో శనివారం నిర్వహించే స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం సంక్రాంతి పండుగ సందర్భంగా ఈనెల నాలుగో శనివారం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కమిషనర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రకటించే స్వచ్ఛ అవార్డులలో గతంలో ఒంగోలు నగరపాలక సంస్థ జి ప్లస్ అవార్డు సాధించిందని గుర్తు చేశారు. ఇంటింటికి వెళ్తున్న పారిశుద్ధ్య సిబ్బంది ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులచే స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. డిప్యూటి మేయర్ వేమూరి సూర్యనారాయణ, కార్పొరేటర్లు, మునిసిపల్ ఇంజనీర్ ఏసయ్య, ఎంహెచ్ఓ వైష్ణవి,శానిటరీ సూపర్వైజర్ పిచ్చియ్య, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## పొదిలి పోలీస్ స్టేషన్లో స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం



**పొదిలి, పెన్ పవర్, జనవరి 24**
స్థానిక పోలీస్ స్టేషన్ లో స్వచ్ఛ్ ఆంధ్ర, స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం జరిగింది. శనివారం నాడు జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న పోలీసు సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజేష్ కుమార్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత వల్ల వ్యాధులను దూరం చేయవచ్చన్నారు. అలాగే సిబ్బంది చేత స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సిఐ రాజేష్ కుమార్తో పాటు ఏఎస్ఐ సత్యనారాయణ రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాలలో పరిశుభ్రత ముఖ్యం... -ఎంపీడీవో మరియదాస్



**పుల్లల చెరువు పెన్ పవర్ జనవరి 24**
పుల్లల చెరువు మండలంలోని రాచకొండ గ్రామపంచాయతీలో శానిటేషన్ విజిట్ను అధికారులు నిర్వహించారు.యుయఫ్ఎస్ సర్వే అంశాలపై గ్రామ ప్రజలకు సమగ్ర అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఎంపీడీవో మరియదాస్ మాట్లాడుతూ సచివాలయంలోని ఉద్యోగులందరూ విధి నిర్వహణలో మరింత బాధ్యతతో వ్యవహరించాలని, అటెండెన్స్ విషయంలో నిర్లక్ష్యం లేకుండా కచ్చితంగా పాటించాలని, అలాగే అన్ని రకాల సర్వేలు నిర్దేశిత కాలపరిమితిలో పూర్తి చేయాలని అధికారుల ద్వారా స్ట్రిక్ట్ ఇన్స్ట్రక్షన్స్ జారీ చేశారు.అదేవిధంగా రాచకొండ గ్రామపంచాయతీలో సాస ప్రోగ్రామ్లో భాగంగా సాస ప్రతిజ్ఞ నిర్వహించి, అనంతరం గ్రామంలో ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీ ద్వారా ప్రజలకు తడి చెత్త, పొడి చెత్త వేరు చేయడం యొక్క ప్రాముఖ్యతను వివరించారు.ప్రతి ఇంటిలో చెత్తను వర్గీకరించి క్లాప్ మిత్రులకు అందజేయాలని ప్రజలకు అవగాహన కల్పించారు.శుభ్రమైన గ్రామమే ఆరోగ్యకరమైన గ్రామమని అధికారులు ఈ సందర్భంగా స్పష్టం చేశారు.అనంతరం అంగన్వాడి సెంటర్ను సందర్శించిన అధికారులు, అక్కడి పిల్లల ఎత్తు--బరువు వివరాలు, అటెండెన్స్ రిజిస్టర్ నిర్వహణ, పిల్లలకు అందిస్తున్న భోజన మెనూ తదితర అంశాలపై అంగన్వాడి కార్యకర్తలను అడిగి తెలుసుకున్నారు. పిల్లల పోషకాహారం, ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ అంజి రెడ్డి, మండల రీ సోర్స్ కో ఆర్డినేటర్ శామ్యుల్,గ్రామ సచివాలయ సిబ్బంది, ఎంఆర్పీ, అంగన్వాడి కార్యకర్తలు, క్లాప్ మిత్రులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## మహాత్మ గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టం పునరుద్దించాలి

### ఉపాధిని దెబ్బ కొట్టే కొత్త చట్టాన్ని వ్యతిరేకించండి.

**దొనకొండ జనవరి 24 పెన్ పవర్ :**
మండలంలోని దొనకొండ మండల సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో దొనకొండ పంచాయతీ పరిధిలోని వీర వెంకటపురం ఎర్రబాలెం బాధాపురం నరసింహనాయుడుపాలెం గ్రామాలలో సిపిఎం మండల కార్యదర్శి చెరుపల్లి అంజయ్య పర్యటించి మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టని పునరుద్దించాలని పేర్కొన్నారు. అంజయ్య మాట్లాడుతూ గ్రామ ప్రాంతాలలో వ్యవసాయ కూలీలకు పేద రైతులకు ఇతర వృత్తిదారులకు పని కల్పించి ఆకలి చావులో నివారణకు వలసలు తగ్గించడానికి తోడ్పడిన మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని మోడీ ప్రభుత్వం రద్దుచేసి కొత్త చట్టాన్ని తెచ్చింది. రాష్ట్రంలో 71 లక్షల మంది ఈ పథకము ద్వారా లబ్ధి పొందుతున్నారు. ఈ పని చేసే వాళ్ళు 40 శాతం మంది దళితులు గిరిజనలు అట్టడుగు వర్గాల పేదలు మిగిలిన వారు ఇతర కులాలకు చెందిన పేదలు ఉన్నారు. మోడీ తెచ్చిన 2025 చట్టాన్ని రద్దుచేసి 2005లో తెచ్చిన చట్టాన్ని పునరుద్దించాలని సిపిఎం డిమాండ్ చేసి ప్రజలకు వివరిస్తుంది. ఈ కార్యక్రమంలో దొనకొండ మండల వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి కుందుర్తి చిన్న నరసింహులు కురవాడి రామయ్య కోల కిరణ్ కుమార్ కొండ ఫ్రాన్సిస్ పురుషోత్తం కాశయ్య తదితరులు పాల్గొనడం జరిగింది.



## పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



**కొమరోలు పెన్ పవర్ జనవరి 24**
పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోగలిగితే ఆరోగ్యపరంగా ఎలాంటి సమస్యలు కూడా తలెత్తవని కొమరోలు ఎంపీడీవో పేర్కొన్నారు. శనివారం కొమరోలు గ్రామ సచివాలయాల ప్రాంగణంలో స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్, స్వర్ణాంధ్రప్రదేశ్ కార్యక్రమాలు నిర్వహించారు. ఆ సందర్భంగా గ్రామ సచివాలయాల కార్యదర్శి ఓ రంగ జనార్ధన్ ఆధ్వర్యంలో గ్రామ సచివాలయాల సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు గ్రామ సచివాలయాల ప్రాంగణాన్ని శుభ్రం చేసి, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచగలమని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించి ఆంజనేయస్వామి ఆలయ కూడలిలో మానవహారంగా ఏర్పడి ప్రజలకు పారిశుధ్యం, పరిశుభ్రత, ప్రజల బాధ్యత తదితర అంశాలపై నినాదాలు చేస్తూ అవగాహన కల్పించారు .ఆ కార్యక్రమంలో స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ స్వర్ణాంధ్రప్రదేశ్ మండల కన్వీనర్ బిజేఎం ఆర్నాల్డ్ , గ్రామ సచివాలయాల సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు, ప్రజలు పాల్గొన్నారు.

# 27న దేశవ్యాప్తంగా బ్యాంకు ఉద్యోగుల సమ్మె

**సమ్మెలో పాల్గొంటున్నందువల్ల 27న కొమరోలు లోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు పని చేయదు.**






**కొమరోలు పెన్ పవర్ జనవరి 24**

జనవరి 27వ తేదీన దేశవ్యాప్తంగా బ్యాంకు ఉద్యోగులు సమ్మె చేస్తున్న కారణంగా ఈనెల 27వ తేదీ కొమరోలు లోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు పనిచేయదని ఆ బ్యాంకు మేనేజర్ అన్వేష్ కుమార్ తెలిపారు. దేశవ్యాప్తంగా బ్యాంకు ఉద్యోగులు చేస్తున్న సమ్మెలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు ఉద్యోగులు కూడా పాల్గొంటున్నారని ఆయన చెప్పారు. ఆ కారణంగా ఈనెల 27వ తేదీ కొమరోలు లోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు పనిచేయదని, అందువల్ల ఖాతాదారులు, బ్యాంకు శ్రేయోభిలాషులు సహకరించాలని అన్వేష్ కుమార్ విజ్ఞప్తి చేశారు.

## జిల్లా గ్రంథాలయంలో స్వర్ణ ఆంధ్ర.. స్వచ్ఛ ఆంధ్ర - పాల్గొన్న సుచిత్ర వీరయ్య చౌదరి



**కార్పొరేషన్ పెన్ పవర్ , ఒంగోలు జనవరి 24**

ఒంగోలులోని జిల్లా గ్రంథాలయ కార్యాలయంలో శనివారం స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. గ్రంథాలయ సిబ్బందితో కలసి చైర్మన్ సుచిత్ర వీరయ్య చౌదరి పాల్గొన్నారు. స్వయంగా గ్రంథాలయాన్ని చైర్మన్ శుభ్రం చేశారు. అదేవిధంగా గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలు అన్నిటిని కూడా స్వయంగా పరిశీలించారు. తదనంతరం గ్రంథాలయ సిబ్బందికి తగు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలకు పూర్వ విద్యార్థుల వితరణ



**కలెక్టరేట్ ఒంగోలు ,పెన్ పవర్ జనవరి 24**

ఒంగోలులోని బండ్ల మిట్ట లో గల బాలికల ఉన్నత పాఠశాలకు కొండేపి ప్రభుత్వ బాలికల పాఠశాల పూర్వ విద్యార్థులు శనివారం మైక్ సెట్ ను బహూకరించారు. గతంలో కొండేపి ప్రభుత్వ బాలికల పాఠశాలలో కొండపి నందు స్కూల్ అసిస్టెంట్ గా విధులు నిర్వహించి పదోన్నతిపై ప్రధానోపాధ్యాయురాలుగా ఒంగోలులోని బండ్లమిట్ట బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయినిగా విధులు నిర్వహిస్తున్న జి. క్రిష్ణ కుమారి వద్ద విద్య అభ్యసించిన కొండపి విద్యార్థులు సేవా కార్యక్రమం నిర్వహించారు. పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు వారి పాఠశాల అభివృద్ధికి సహాయపడాలని ప్రధానోపాధ్యాయిని జి. క్రిష్ణకుమారి ఆశాభావాన్ని వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్, పూర్వ విద్యార్థులు సుంకర సుమతి, బోడా బ్రహ్మానందం, మామిళ్లపల్లి మాధురి పాల్గొన్నారు.

## లక్ష్మీ నరసింహం భౌతికకాయానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే ఇంటూరి



**వలేటివారిపాలెం, పెన్ పవర్ జనవరి 24**

పోకూరు గ్రామానికి చెందిన సీనియర్ రాజకీయ నాయకుడు ఉన్నం లక్ష్మీనరసింహం అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు శనివారం పోకూరులోని వారి స్వగృహంలో లక్ష్మీనరసింహం భౌతికకాయానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వారి కుమారులు వీరాస్వామి, శరత్ లను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఉప్పుటూరి శ్రీనివాసరావు, ఘట్టమనేని లక్ష్మీనరసింహం, సోమినేని తిరుమల, గురజాల బెంజిమెన్ మరియు ఇతర నాయకులు పాల్గొన్నారు.

# అద్దంకి అభివృద్ధికి 'గొట్టిపాటి' మార్క్: 1000 ఎకరాల్లో సోలార్ పరిశ్రమ

**11 వేల మంది విద్యార్థులకు సైకిళ్లు.. -కూకట్లపల్లిలో వాటర్ ప్లాంట్, స్వచ్ఛ రథం ప్రారంభం**








**అద్దంకి ఆర్సి ఇంచార్జ్, పెన్ పవర్ జనవరి 24:**

అద్దంకి నియోజకవర్గాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయడంతో పాటు, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం తమ ప్రభుత్వం అంకితభావంతో పనిచేస్తుందని రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. శనివారం బల్లికురువ మండలంలోని కూకట్లపల్లి గ్రామంలో మంత్రి పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్.ఓ వాటర్ ప్లాంట్ను, మండల స్వచ్ఛ రథాన్ని ప్రారంభించిన అనంతరం, పాఠశాల విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లను పంపిణీ చేశారు.

**మార్చి నాటికి లక్ష్యం పూర్తి..:** మంత్రి మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల నడక కష్టాలను తీర్చేందుకు ఈ సైకిళ్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. మార్చి నాటికి మొత్తం 11 వేల మంది విద్యార్థులకు సైకిళ్లను అందజేస్తామని స్పష్టం చేశారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సూచనల మేరకు, ఈ కార్యక్రమానికి ఎలాంటి రాజకీయ రంగులు పూయకుండా, కేవలం విద్యార్థుల ప్రయోజనమే పరమావధిగా అమలు చేస్తున్నామని వివరించారు. ఈ బృహత్తర కార్యానికి అసిస్ట్ ఎన్జీఓ సహకారం మరువలేనిదని, తన వంతుగా కిషోర్ గ్రానైట్స్ ద్వారా 1000 సైకిళ్లు అందజేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు.

**స్థానికంగానే ఉద్యోగ అవకాశాలు..:** అద్దంకి ప్రాంతాన్ని పారిశ్రామిక హబ్ గా తీర్చిదిద్దే క్రమంలో 1000 ఎకరాల్లో భారీ సోలార్ ప్యానెల్ తయారీ పరిశ్రమను ఏర్పాటు చేయబోతున్నట్లు మంత్రి ప్రకటించారు. దీని ద్వారా స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉపాధి లభిస్తుందని, ఉద్యోగాల కోసం వలస వెళ్లాల్సిన పరిస్థితి ఉండదని భరోసా ఇచ్చారు.

**విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు...:** రాష్ట్రవ్యాప్తంగా మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తున్నామని మంత్రి తెలిపారు. 'తల్లికి వందనం' పథకం కింద ప్రతి విద్యార్థి తల్లి ఖాతాలో రూ.13 వేలు జమ చేస్తున్నామని, తద్వారా తల్లులకు గౌరవం, పిల్లలకు భరోసా లభిస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో 100 శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ఉపాధ్యాయులు మరింత బాధ్యతతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారమే ప్రాధాన్యం గ్రామంలో నిర్వహించిన గ్రీవెన్స్లో ప్రజల నుండి మంత్రి స్వయంగా అర్జీలను స్వీకరించారు. అధికారులెవరూ ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యం చేయకూడదని, ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులకు తక్షణమే స్పందించి పరిష్కరించాలని కఠిన ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, మండల స్థాయి ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, విద్యార్థులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పేదల హృదయాల్లో అస్తమించని రవీంద్రుడు

**- ఘనంగా మాజీ మంత్రి పరిటాల రవీంద్ర వర్ధంతి**

**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ జనవరి 24**

అణగారిన వర్గాలకు అండగా, పేద వర్గాలకు తోడుగా, వెనుకబడి రాయలసీమలో వివక్షకు గురవుతున్న వర్గాలకు భరోసాగా నిలబడి అన్నగా కీర్తించబడిన పరిటాల రవీంద్ర ఆశయాలను కొనసాగిస్తూ ముందుకు సాగుదామని తెలుగుదేశం పార్టీ నాయకులు, పరిటాల రవీంద్ర అభిమానులు పేర్కొన్నారు. శనివారం మాజీ మంత్రి పరిటాల రవీంద్ర 21వ వర్ధంతి సందర్భంగా స్థానిక 36వ డివిజన్ అంజయ్య రోడ్ లో ఘనంగా నిర్వహించారు. ముందుగా పరిటాల రవీంద్ర చిత్రపటానికి తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, పరిటాల రవీంద్ర అభిమానులు పుష్పాంజలి ఘటించారు. అనంతరం ఏర్పాటుచేసిన సభలో నాయకులు మాట్లాడుతూ పరిటాల రవీంద్ర రాయలసీమకే కాకుండా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి నాయకుడిగా ఎదిగి పేద ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నా లేకున్నా కార్యకర్తల కోసం నిఖార్సుగా నిలబడిన నాయకుడు పరిటాల రవీంద్ర అని కొనియాడారు. పరిటాల రవీంద్ర వర్ధంతి సభకు తెలుగుదేశం పార్టీ నాయకులు దాయినేని ధర్మ, నల్లూరి ప్రదీప్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో పి డి సి సి బ్యాంక్ చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య, ఒంగోలు వ్యవసాయ మార్కెట్ కమిటీ



చైర్మన్ రాచగర్ల వెంకటరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ మంత్రి శ్రీనివాసరావు, ప్రముఖ వ్యాపారవేత్త మండవ మురళీకృష్ణ, హర్షిణి కాలేజ్ కరస్పాండెంట్ గోరంట్ల రవికుమార్, ఒంగోలు ఏఎంసీ మాజీ చైర్మన్ కామేపల్లి శ్రీనివాసరావు, కొఠారి నాగేశ్వరరావు, బండారు మదన్, టి అరుణ, పసుపులేటి సునీత, ఆర్ల వెంకటరత్నం, ఎర్ర సారథి పాటిబండ్ల వెంకటేశ్వర్లు, అబ్బూరి శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

## రెండు బస్సులు ఢీ ఒకరు మృతి - 12 మందికి తీవ్ర గాయాలు






**కొనకనమిట్ల పెన్ పవర్ జనవరి 24**

బొలెరో వాహనాన్ని ఆర్టీసీ బస్ ఢీకొన్న విషాదకర సంఘటన శనివారం తెల్లవారు ఝూమున చోటుచేసుకుంది.మండలంలోని చిన్నారికట్ల గ్రామ సమీపంలో రోడ్డుపై ఆగి ఉన్న బొలెరో వాహనాన్ని ట్రావెల్స్ బస్ ఢీకొట్టినట్లు స్థానికులు తెలిపారు.అదే సమయంలో విజయవాడ నుంచి కనిగిరి వెళ్తున్న ఆర్టీసీ బస్ ఎదురుగా ఉన్న ట్రావెల్స్ బస్సు ఢీకొనడంతో ప్రమాదం మరింత తీవ్రతరమైంది.ఈ ప్రమాదంలో బస్లో ప్రయాణిస్తున్న అన్నపురెడ్డి జనార్ధన్ రెడ్డి (50) అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానికులు వెల్లడించారు.మరో 12 మందికి తీవ్ర గాయాలు కావడంతో ఘటన స్థలంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.స్థానికుల సమాచారం మేరకు 108 అంబులెన్స్ ద్వారా గాయపడిన వారిని వెంటనే పొదిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం.ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు.ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

# బాలికలు క్రమశిక్షణ తో ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

**ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఓంకార్**






**గిద్దలూరు పెన్ పవర్ జనవరి 24**

జాతీయ బాలిక దినోత్సవం, బాల్య వివాహముల నిర్మూలన గురించి అవగాహన సదస్సు ను మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గిద్దలూరు జిల్లా పరిషత్ బాలికల హై స్కూల్ లో శనివారం నిర్వహించారు .ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఏ. ఓంకార్ మాట్లాడుతూ బాలికల సంరక్షణ కొరకు ఒక ప్రత్యేక రోజును జరుపుకోవటం గొప్ప విషయమని, బాలికలందరూ ఈ విషయం తెలుసుకొని సమాజంలోని పరిస్థితుల పట్ల అవగాహన ఏర్పరచుకోవాలన్నారు. బాలికలు వారి శారీరక పరిస్థితులు , మానసికముగా ఎదగాలనే ఉద్దేశంతో వారి వివాహ వయస్సును 18 సంవత్సరములుగా నిర్ణయించబడినదని తెలియజేశారు. బాధిత వివాహముల నిర్మూలనకై టోల్ ఫ్రీ నెంబర్ 1098, 100, నల్సా టోల్ ఫ్రీ నెంబర్ 15100 ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు చట్ట విరుద్ధమన్నారు . క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలు చేరుకోవాలని , అన్ని రంగాలలో మహిళలు సమానత్వం సాధిస్తున్నారని తెలియజేశారు. సెల్ ఫోన్ల ద్వారా మంచిని మాత్రమే గ్రహించాలన్నారు. ఇష్టం లేకుండా బాల్య వివాహం జరిగితే సదరు బాలిక రెండు సంవత్సరాలలోపు సదరు వివాహమును రద్దు చేయమని కోర్ట్ ను ఆశ్రయించవచ్చు అన్నారు .ఈ కార్యక్రమంలో స్కూల్ హెడ్మాస్టర్ పి. నాగభూషణ్ రెడ్డి, ఐసిడిఎస్ సూపర్వైజర్ బి, జ్యోతి, సైన్స్ మాస్టర్ ఎల్ .సగీర్, ప్యానల్ న్యాయవాది ఎం, పిచ్చయ్య,న్యాయవాది యస్.రాజశేఖర్ రెడ్డి, ఇతర అధ్యాపకేతర సిబ్బంది, పారా లీగల్ వాలంటరీ అద్దంకి. మధుసూధనరావు , బాలికలు పాల్గొన్నారు.

# నిర్దేశిత లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలి

**- ఏపీఎం జ్యోతి ప్రసాద్ బాబు**

**మార్చి లోపు అర్హత ఉన్న సంఘాలన్నింటికీ బ్యాంకు రుణాలు అందించాలి**





**అద్దంకి ఆర్సి ఇంచార్జ్, పెన్ పవర్ జనవరి 24:**

అద్దంకి మండలంలోని గ్రామ సంఘ సహాయకులు, సిబ్బంది తమకు కేటాయించిన అన్ని విభాగాల్లో పనితీరు మెరుగుపరుచుకుని, లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని ఏ.పి.ఎం జ్యోతి ప్రసాద్ బాబు ఆదేశించారు. శనివారం అద్దంకిలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రతి నెల పొదుపు సంఘాల సమావేశాలు క్రమబద్ధంగా నిర్వహించాలని, శ్రీనిధి రుణాల వసూళ్లు సక్రమంగా చేయాలని సూచించారు. ఈ మార్చి లోపు అర్హత ఉన్న ప్రతి సంఘానికి బ్యాంకు రుణాలు మంజూరయ్యేలా చూడాలని, సంక్షేమ పథకాల అమలులో మండలం ముందుండాలని తెలిపారు. సమావేశాలకు సిబ్బంది సమయపాలన పాటించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనిధి ప్రాజెక్టు అధికారి శంకర్, మండల సమాఖ్య అధ్యక్షురాలు, క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

# మార్కాపురం జిల్లా అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలి - మాజీ శాసనసభ్యులు కదిరి

**కనిగిరి ఆర్సీ ఇంచార్జి, పెన్ పవర్, జనవరి 24**

మార్కాపురం జిల్లా అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యధికంగా నిధులు కేటాయించాలని, జిల్లా అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని వైసీపీ విశాఖపట్నం పార్లమెంటు పరిశీలకులు, కనిగిరి మాజీ శాసనసభ్యులు కదిరి బాబురావు అన్నారు. శనివారం కనిగిరిలోని తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పశ్చిమ ప్రకాశం ప్రాంతంలోని గిద్దలూరు, మార్కాపురం, ఎర్రగొండపాలెం, కనిగిరి నియోజకవర్గాలతో ఏర్పాటు చేసిన మార్కాపురం జిల్లా ఇప్పటికీ వెనుకబడిన స్థితిలోనే ఉందని అన్నారు. మార్కాపురం జిల్లా మెట్టప్రాంతమని, వర్షాధారిత వ్యవసాయంపై రైతులు ఆధారపడుతున్నారని తెలిపారు. తాగునీరు, సాగునీటి సౌకర్యాల కల్పనలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. జిల్లా అభివృద్ధికి కీలకమైన వెలిగొండ ప్రాజెక్టును యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. భోగాపురం ఎయిర్పోర్ట్ నిర్మాణ పనులు 16 నెలల్లో పూర్తి చేయడం సాధ్యమా అని ప్రశ్నించిన కదిరి బాబురావు, ఆ ప్రాజెక్టుకు సంబంధించిన కీలక పనులు వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలోనే జరిగాయని పేర్కొన్నారు. అప్పట్లో వైఎస్సార్సీపీ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేసిన ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇప్పుడు ఆ ప్రాజెక్టు క్రెడిట్ తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలోని ఎన్డీఏ



కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీల అమలులో విఫలమైందని విమర్శించారు. అమరావతిలో భూసేకరణ జరుగుతున్న నేపథ్యంలో భూములు ఇచ్చిన రైతులకు ప్రభుత్వం స్పష్టమైన భరోసా ఇవ్వాలని కోరారు. ఇంకా మిగిలిన కాలంలో అయినా కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసి వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని కదిరి బాబురావు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ షేక్ ఫయాజ్, కదిరి రమణయ్య, బొట్టు శ్రీను, మార్తల రాముడెడ్డి, ముత్యాల ప్రతాప్, షేక్ షరీఫ్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

# అద్దంకిలో వైఎస్ఆర్సీపీ సమరశంఖం: క్షేత్రస్థాయి నుంచి పార్టీ పటిష్టతకు పిలుపు

### కష్టపడిన వారికే భవిష్యత్తులో గుర్తింపు పార్టీ పరిశీలకుల వెల్లడి

### 100 పడకుల ఆసుపత్రి ఏది? మంత్రి గొట్టిపాటి పై అశోక్ కుమార్ విమర్శలు







**అద్దంకి ఆర్సి ఇంచార్జ్, పెన్ పవర్ జనవరి 24:**
వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు అద్దంకి నియోజకవర్గంలో కసరత్తు ముమ్మరమైంది. శనివారం అద్దంకి నియోజకవర్గ వైఎస్ఆర్సీపీ సమన్వయకర్త డాక్టర్. చింతలపూడి అశోక్ కుమార్ ఆధ్వర్యంలో పార్టీ సంస్థాగత నిర్మాణ సమావేశం ఘనంగా జరిగింది. ఈ భేటీలో రాష్ట్ర స్థాయి నేతలు పాల్గొని రాబోయే రోజుల్లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలపై దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి ప్రకాశం జిల్లా వైఎస్ఆర్సీపీ పరిశీలకులు బత్తుల. బ్రహ్మానంద రెడ్డి, బాపట్ల జిల్లా వైఎస్ఆర్సీపీ అధ్యక్షుడు మేరుగ. నాగార్జున, బాపట్ల పార్లమెంట్ పరిశీలకులు, ఎమ్మెల్సీ తూమాటి. మాధవరావు, అద్దంకి నియోజకవర్గ పరిశీలకులు కర్నేటి. వెంకట ప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

**కమిటీల నియామకంపై కీలక ఆదేశాలు**

నాయకులు మాట్లాడుతూ.. నియోజకవర్గ వ్యాప్తంగా మండల కమిటీలు, మండల అనుబంధ విభాగాల కమిటీలతో పాటు వార్డు, గ్రామ స్థాయి కమిటీలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. పార్టీ నిర్మాణం పటిష్టంగా ఉంటేనే ప్రజా సమస్యలపై సమర్థవంతంగా పోరాడగలమని, ఇందుకోసం కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు.

**కష్టపడే వారికి తగిన గుర్తింపు**

రానున్నది వైఎస్ఆర్సీపీ ప్రభుత్వమే.. నేడు పార్టీ కోసం అంకితభావంతో కష్టపడే ప్రతి కార్యకర్తకు, నాయకుడికి భవిష్యత్తులో తగిన గుర్తింపుతో పాటు గౌరవం లభిస్తుంది” అని నాయకులు భరోసా ఇచ్చారు. కార్యకర్తలే పార్టీకి వెన్నెముక అని, వారి సంక్షేమం, గౌరవం కోసం పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పేర్కొన్నారు.

**100 పడకుల ఆసుపత్రి ఏది?..:** అద్దంకి: నియోజకవర్గంలో జనాభా పెరుగుతున్నా, వంద పడకుల ఆసుపత్రి నిర్మాణంపై స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి గొట్టిపాటి రవికుమార్ నిర్లక్ష్యం వహిస్తున్నారని వైసిపి సమన్వయకర్త డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్ విమర్శించారు. అద్దంకిలో ఆసుపత్రి సాధన కోరుతూ రూపొందించిన వాల్ పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కనీస వైద్య సదుపాయాలు కల్పించలేని స్థితిలో ప్రభుత్వం ఉందని ధ్వజమెత్తారు. తక్షణమే ఆసుపత్రి నిర్మాణ పనులు చేపట్టాలని, లేనిపక్షంలో ప్రజల పక్షాన పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

**కార్యకర్తలతో కిక్కిరిసిన ప్రాంగణం..:** సమన్వయకర్త డాక్టర్. అశోక్ కుమార్ నాయకత్వంలో జరిగిన ఈ సమావేశానికి నియోజకవర్గంలోని అన్ని మండలాల కన్వీనర్లు, కీలక నేతలు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహం నింపేలా సాగిన ఈ కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలతో నేరుగా మాట్లాడి వారి సూచనలను స్వీకరించారు.

# కనిగిరిలో రథసప్తమికి విస్తృత ఏర్పాట్లు

### - సప్త వాహనాలతో పట్టణంలో భక్తులకు దర్శనం ఇవ్వనున్న శ్రీవారు

### - భక్తులతో కోలాట భజనలు



**కనిగిరి ఆర్సీఇంచార్జ్, పెన్ పవర్, జనవరి 24**
కనిగిరి పట్టణంలో రథసప్తమిని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు శ్రీదేవి భూదేవి సమేత శ్రీవెంకటేశ్వర స్వామి దేవస్థానం కమిటీ విస్తృత ఏర్పాట్లు చేపట్టినట్లు ఆలయ కమిటీ గోనుగుంట గోపాల్ తెలిపారు. రథసప్తమి పురస్కరించుకొని ఆలయంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామికి, రమా సహిత సత్యనారాయణ స్వామికి, చదువుల తల్లి సరస్వతి అమ్మవారికి, లక్ష్మీనారాయణ స్వామికి విశేషాలు, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. రథసప్తమి సందర్భంగా పట్టణంలో సప్త వాహనాలలో శ్రీవారు భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ఊరేగింపు మహోత్సవాలలో కోలాట భజనలు, వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. అంగరంగ వైభవంగా జరిగే ఊరేగింపు మహోత్సవాలను పురస్కరించుకొని దాతలు పట్టణంలోని పలు ప్రాంతాలలో భక్తులకు అన్నప్రసాదం, అల్పాహారం, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేయనున్నారు.

# ఆడపిల్ల ఇంటికి వెలుగు



**గిద్దలూరు పెన్ వర్ జనవరి 24**
గిద్దలూరులోని బాలసదనం వసతి గృహంలో ఉంటూ చదువుకుంటున్న బాలికలకు జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా యువ ప్రగతి పథం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పెన్నులు నోట్ బుక్స్ పంపిణీ చేశారు ఈ సందర్భంగా బాల సదన్ సూపరిడెంట్ ఝాన్సీ రాణి మాట్లాడుతూభరత మాతకుమరో రూపం బాలిక యని .భావి భారతం బాలికల చేతుల్లో బాలికలు క్రమశిక్షణతో చదువుకొని బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని కోరారు ఈ కార్యక్రమంలో యువ ప్రగతి పథం స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు సయ్యద్ ఫరూఖ్ సభ్యులు మనోజ్ కిషోర్ వాసవి జాగృతిమిత్ర మండలి క్లబ్ అధ్యక్షుడు హరిక్రిష్ణ పాల్గొన్నారు.

# పశువైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

### కొరిశపాడు పశువైద్యాధికారి డాక్టర్: ఎం. రాంబాబు



**అద్దంకి ఆర్సి ఇంచార్జ్, పెన్ పవర్ జనవరి 24:**
కొరిశపాడు మండలంలోని పమిడిపాడు గ్రామంలో శనివారం పశు ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని అద్దంకి పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ బ్రహ్మయ్య ప్రారంభించారు. ఈ శిబిరంలో 25 సాధారణ కేసులు, 15 గర్భకోశ సంబంధిత వ్యాధులకు చికిత్స అందించడంతో పాటు గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బ్రహ్మయ్య మాట్లాడుతూ.. పశువుల ఆరోగ్యంపై రైతులు శ్రద్ధ వహించాలని, ఇలాంటి ఉచిత శిబిరాలను వినియోగించుకోవాలని కోరారు. కొరిశపాడు పశువైద్యాధికారి ఎం. రాంబాబు మాట్లాడుతూ.. ఈ నెల 31 వరకు అన్ని గ్రామాల్లో ఈ ఆరోగ్య శిబిరాలు జరుగుతాయని, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందుల పంపిణీ కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది అనిల్, శ్రీను, రాజేశ్వరి, వినోద్, విజయ్, ప్రశాంత్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

# అద్దంకి, మేదరమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం బాబులకు కోర్టు జలక్

### మద్యం తాగి వాహనాలు నడిపిన ఎనిమిది మందికి భారీ జరిమానా

**అద్దంకి ఆర్సి ఇంచార్జ్, పెన్ పవర్ జనవరి 24:**
అద్దంకి, మేదరమెట్ల పోలీస్ స్టేషన్ల పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన ఎనిమిది మందికి అద్దంకి న్యాయస్థానం భారీ జరిమానా విధించింది. శనివారం అద్దంకి సర్కిల్ ఇన్స్పెక్టర్ సుబ్బరాజు, మేదరమెట్ల ఎస్.ఐ మహమ్మద్ రఫీ నిందితులను న్యాయమూర్తి బి. అఖిల ఎదుట హాజరుపరిచారు. మేదరమెట్ల పరిధిలో పట్టుబడిన నలుగురికి వరుసగా 8 వేలు, 7 వేలు, 5 వేలు మరియు 3 వేల రూపాయల చొప్పున మొత్తం 23 వేల రూపాయల జరిమానా పడింది. అలాగే అద్దంకి పోలీస్ స్టేషన్ పరిధిలో పట్టుబడిన మరో నలుగురికి ఒక్కొక్కరికి 5 వేలు, 3 వేలు, 300, 3 వేల రూపాయల చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. నిబంధనలు ఉల్లంఘించి మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరించారు.

# వెలుగొండ ప్రాజెక్టును వ్యవసాయం సీజన్ నాటికి పూర్తి చేయాలి

### రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు డి సోమయ్య.




**గిద్దలూరు పెన్ పవర్ జనవరి 24**
రైతు సంఘం గిద్దలూరు ఏరియా సమావేశం శనివారం ప్రజాసంఘాల కార్యాలయం లో ఎం చంద్రపాల్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు డి సోమయ్య పాల్గొని మాట్లాడుతూ పశ్చిమ ప్రాంతానికి వెలుగొండ ప్రాజెక్టు జీవనాధారం అని ఈ ప్రాజెక్టును అన్ని రాజకీయ పార్టీలు ఓటు బ్యాంకుగా చూసుకుంటున్నాయి తప్ప ప్రాజెక్టును పూర్తి చేయటం లేదని అన్నారు. వెలుగొండ ప్రాజెక్టు పూర్తయితే గిద్దలూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో భూగర్భ జలాలు పెరిగి వ్యవసాయ పనులు పుష్కలంగా ఉంటాయన్నారు. వెలుగొండ ప్రాజెక్టు పూర్తి చేసేందుకు రేపు జరగబోవు బడ్జెట్లో దాదాపు 3 వేల కోట్లు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు లేనిపక్షంలో రైతు సంఘంగా ఆందోళన చేస్తామన్నారు. ఈనెల 12వ తేదీన దేశవ్యాప్తంగా జరుగుతున్న రైతు సంఘాల జాతీయ ఆందోళనలో రైతులు ఆయా గ్రామాలలో రైతాంగ సమస్యలపై ఆందోళనలో పాల్గొనాలన్నారు. అనంతరం గిద్దలూరు ఏరియా రైతు సంఘం నూతన కన్విన్ కమిటీని ఎన్నుకోవడం జరిగింది. కన్వీనర్ గా వి రామకృష్ణ, కో కన్వీనర్ గా ఎం చంద్రపాల్ కమిటీ సభ్యులుగా రవి చంద్రారెడ్డి, శివాజీ, యేసేబు, సిహెచ్ కోటిరెడ్డిని ఎన్నుకున్నారు.

# పశ్చిమ బెంగాల్ వాసి ముంజూర్ ఆలం లస్కర్ మృతి పై దర్యాప్తు వేగవంతం

### పశ్చిమ బెంగాల్ సీఎంవో నుంచి ఏపీ సీఎంకు అందిన సమాచారం???

### మార్కాపురం డిఎస్పీ, సబ్ కలెక్టర్ ప్రెస్ మీట్ ఏర్పాటుచేసి వెల్లడించిన వివరాలు.




**కొమరోలు పెన్ పవర్ జనవరి 24.**
కొమరోలు లోని మహి ఫ్యాషన్స్ షాపులో డిజైనర్ గా పనిచేస్తూ అనుమానాస్పదంగా మృతి చెందిన పశ్చిమబెంగాల్ కు చెందిన ముంజూర్ ఆలం లస్కర్ మృతిపై దర్యాప్తు వేగవంతం చేస్తున్నట్లుగా మార్కాపురం డి.ఎస్.పి యు నాగరాజు, సబ్ కలెక్టర్ శివరామిరెడ్డి శుక్రవారం సాయంత్రం మార్కాపురం లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని బస్నుపురి గ్రామానికి చెందిన ముంజూర్ ఆలం లస్కర్ ఈనెల 1వ తేదీ నుంచి కొమరోలు లోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు వీధిలో నెలకొల్పిన మహి ఫ్యాషన్స్ షాప్ లో డిజైనర్ గా పనిచేస్తున్నాడు. లస్కర్ మగ్గం పనితో పాటు జాకెట్లు చీరలకు డిజైన్ నెగషీ వర్క్ చేస్తుండేవాడు. కాగా ఈనెల 19వ తేదీ రాత్రి 9:30 గంటల సమయంలో లస్కర్ మద్యం సేవించి షాపులో ఉన్న చీరలను బ్యాగులో సర్దుకుని పారిపోయేందుకు ప్రయత్నిస్తుండగా, తాము సమాచారం అందుకొని అతనిని పట్టుకునేందుకు ప్రయత్నించగా, ఒక వీధిలో లస్కర్ తన బ్యాగును రోడ్డు పక్కన పడవేసి మద్యం మత్తులో పడిపోయి ఉన్నాడని ,ఆ మేరకు అతనిని పోలీసులకు అప్పగించేందుకు ప్రయత్నించగా, మద్యం మత్తులో ఉన్న లస్కర్ పరిస్థితి చూసిన పోలీసులు అతనిని ఉదయం పోలీస్ స్టేషన్కు తీసుకు రావలసిందిగా కోరారని, అనంతరం అతనిని షాప్ కు తరలించి సపర్యలు చేసి అతను మళ్లీ పారిపోకుండా ఉండేందుకు వీలుగా గదికి తాళం వేసామని పేర్కొంటూ షాపు నిర్వాహకులు స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. తాము 20వ తేదీ ఉదయం వెళ్లి చూడగా కొన ఊపిరితో ఉన్నాడని ఆ మేరకు తాము నీళ్లు తాగించామని ఆ తర్వాత లస్కర్ మృతి చెందాడని గుర్తించి, తాము పోలీసులకు, పశ్చిమ బెంగాల్లో ఉన్న లస్కర్ భార్యకు, కంభంలో ఉన్న లస్కర్ స్నేహితునికి సమాచారం అందించామని షాప్ నిర్వాహకులు వెల్లడించారు .ఆ మేరకు కొమరోలు ఎస్ఐ నాగరాజు సంఘటన స్థలానికి చేరుకొని శవానికి పంచనామా నిర్వహించి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. సమాచారం అందుకున్న కంభం లో ఉంటున్న లస్కర్ స్నేహితులు కొమరోలుకు చేరి పంచనామ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం లస్కర్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గిద్దలూరు తరలించి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని లస్కర్ బంధువులకు పోలీసులు అప్పగించారు. ఆ మేరకు లస్కర్ మృతదేహాన్ని అతని బంధువులు పశ్చిమబెంగాల్ లోని స్వగ్రామానికి తరలించుకుని వెళ్లారు పై సమాచారం పెన్ పవర్ పాఠకులకు వితమే . కాగా పశ్చిమబెంగాల్ కు చేరుకున్న లస్కర్ బంధువులు లస్కర్ మృతి పై అనుమానాలు వ్యక్తం చేస్తూ అక్కడి పోలీసులకు ,సీఎంఓ కు ఫిర్యాదు చేశారని, ఆమెకు పశ్చిమ బెంగాల్ సీఎం నుంచి అక్కడి, పోలీసులనుంచి ఆంధ్ర ప్రదేశ్ సీఎం ఓ కు సమాచారం అందిందని విశ్వసనీయ వర్గాల సమాచారం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మార్కాపురం డిఎస్పి యు నాగరాజు, మార్కాపురం సబ్ కలెక్టర్ శివరామిరెడ్డి ఈనెల 23వ తేదీ శుక్రవారం మార్కాపురంలో ప్రెస్ మీట్ ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. డిఎస్పి, సబ్ కలెక్టర్ వెల్లడించిన వివరాల మేరకు పశ్చిమబెంగాల్ కు చెందిన ముంజూరు ఆలం లస్కర్ అనే 44 సంవత్సరాల యువకుడు కంభం లో పనిచేస్తున్న పశ్చిమబెంగాల్ రాష్ట్రానికి చెందిన స్నేహితులు, బంధువుల సిఫారసుతో కొమరోలు లోని మహి ఫ్యాషన్స్ షాపులో డిజైనర్ గా ఈ నెల 1వ తేదీన చేరాడు. అయితే మద్యం అలవాటు ఉన్న లస్కర్ ఈనెల 19వ తేదీన మద్యం తాగాడని సాయంత్రం వరకు సరిగా భోజనం చేయలేదని, రాత్రి తన గదిలో నిద్రపోయాడని, మరుసటి రోజు ఉదయం మహి ఫ్యాషన్స్ షాపు నిర్వాహకురాలు వెళ్లి చూడగా, లస్కర్ మృతి చెందినట్లుగా గుర్తించి తన భర్తకు, కొమరోలు పోలీసులకు సమాచారం అందించారని డిఎస్పి వెల్లడించారు. ఆ మేరకు కొమరోలు ఎస్ఐ నాగరాజు శవాన్ని పరిశీలించి శవ పంచ నామ నిర్వహించి అనుమానాస్పద మృతిగా వివిధ సెక్షన్ల కింద 6/26 క్రైమ్ నెంబర్తో కేసు నమోదు చేశారని, అనంతరం ముంజూర్ ఆలం లస్కర్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గిద్దలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారని ఆయన పేర్కొన్నారు. ఆ సందర్భంగా వైద్యులు లస్కర్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి అతని గుండె ,లివర్, విసరా, తదితర ముఖ్యభాగాలను సేకరించి గుంటూరులోని ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ కు పంపించారని తెలిపారు. పోస్టుమార్టం అనంతరం శవాన్ని ముంజూరాలం లస్కర్ బంధువులకు అప్పగించినట్లుగా ఆయన తెలిపారు. అయితే శవాన్ని పశ్చిమ బెంగాల్ లోని తమ స్వగ్రామానికి తరలించుకుని వెళ్లిన ముంజూరాలం లస్కర్ కుటుంబ సభ్యులు ముంజూర్ ఆలం లస్కర్ మృతి పై అనుమానాలు వ్యక్తం చేస్తూ అక్కడి పోలీసులను ఆశ్రయించారని తెలిపారు. అక్కడి నుంచి అందిన సమాచారం మేరకు అక్కడి పోలీసులకు కొమరోలు పోలీస్ స్టేషన్ నుంచి లస్కర్ మృతి సంఘటనకు సంబంధించిన రికార్డులను పశ్చిమ బెంగాల్ పోలీసులకు పంపించామని ఆయన తెలిపారు, అంతేకాక లస్కర్ మృతి పై విచారణ వేగవంతం చేస్తున్నామని, ఎలాంటి దాపరికాలు లేకుండా నిష్పక్షపాతంగా సమగ్రంగా దర్యాప్తు చేస్తున్నట్లుగా డిఎస్పి వెల్లడించారు. లస్కర్ మృతదేహంపై అతడు మృతి చెందేందుకు అవకాశం ఉన్నట్లుగా గాయాలు కనిపించలేదని , లస్కర్ గుండెపోటుతో లేదా, డీహైడ్రేషన్ తో, లేదా విష ప్రయోగంతో లేదా మరో కారణంతో మృతి చెంది ఉంటాడని అనుమానిస్తూ శవ పంచ నామాలో , కొమరోలు ఎస్ఐ నాగరాజు పొందుపరిచారని, లస్కర్ శరీరానికి అంతర్గతంగా ఏవైనా గాయాలు ఉన్నట్లయితే ఫోరెన్సిక్ ల్యాబ్ నివేదికలో బహిర్గతం కాగలవని డి.ఎస్.పి వెల్లడించారు. కుటుంబ సభ్యులు లేదా మరెవరైనా లస్కర్ మృతిపై అనుమానాలు లేదా తమకు తెలిసిన వివరాలు వెల్లడిస్తే ఆకోణంలో కూడా దర్యాప్తు వేగవంతం చేస్తామని డిఎస్పి పేర్కొన్నారు. వ్యాపార రీత్యా ఓనర్ కు వర్కర్కు మధ్య చిన్న చిన్న బేధాభిప్రాయాలు ఉండటం సహజమేనని అంతమాత్రాన ఒక నిర్ణయానికి రాలేమని డిఎస్పి వెల్లడించారు . ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ నుండి అందే నివేదిక ఆధారంగా కేసును మరింత వేగవంతం చేస్తామని డిఎస్పి పేర్కొన్నారు. పశ్చిమబెంగాల్ కు చెందిన ముంజూరు ఆలం లస్కర్ మృతి సంఘటన ప్రశాంతంగా ముగిసిపోయిందని అందరూ భావిస్తున్న సమయంలో మార్కాపురం డి.ఎస్.పి ,సబ్ కలెక్టర్ ప్రెస్ మీట్ ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించడంతో పాటు పశ్చిమ బెంగాల్లో మృతుడు లస్కర్ బంధువులు అక్కడి పోలీసులకు, సీఎం ఓ కు ఫిర్యాదు చేసి ,ఆందోళన, నిరసన కార్యక్రమాలు చేస్తున్నట్లుగాను ,అక్కడే లస్కర్ మృత దేహానికి రీ పోస్టుమార్టం నిర్వహిస్తారనే ప్రచారం సాగుతున్నందువల్ల స్థానిక ప్రజలు ముంజురాలం లస్కర్ మృతి కి వెల్లడి కానున్న కారణాలకు కొరకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ముంజురాలం లస్కర్ ది సహజ మరణమా? లేక మరే కారణాలతో మృతి చెందాడా? లేక ఆత్మహత్య చేసుకున్నాడా? లేక శరీరంలో అంతర్గతంగా కలిగిన బలమైన గాయాల కారణంగా మృతి చెందాడా? అనే విషయాలు పోస్టుమార్టం నివేదిక, ఫోరెన్సిక్ ల్యాబ్ అందజేసే నివేదిక ఆధారంగా వెల్లడి కాగలవని స్థానిక పోలీసులు చెబుతున్నారు. ఇతర రాష్ట్రానికి చెందిన వ్యక్తి కొమరోల్లో మృతి చెందడం పట్ల పలువురు విచారం వ్యక్తం చేస్తున్నారు.

# పలించిన కమీషనర్ రామనబాబు మంత్రాంగం

### అన్నా క్యాంటీన్లో శనివారం స్వీట్

**గిద్దలూరు పెన్ పవర్ జనవరి 24**



గిద్దలూరు మున్సిపాలిటీ కమీషనర్ ఇస్కాన్ వారి తో జరిపిన మంత్రాంగం ఫలించింది. దీంతో గిద్దలూరు అన్నా క్యాంటీన్ లో ప్రతి శనివారం భోజనం తో పాటు ఇదొక రకం స్వీట్ వడ్డించే విదంగా చేశారు. అన్నా క్యాంటీన్ నిత్యం కేవలం రు 5/-లకే భోజనము వడ్డిస్తున్నారు .ఈభోజనాన్ని నిత్యం వెయ్యి మందికి పైగా పేదలు భోజనము చేస్తున్నారు. నిత్యం సాధారణ భోజనం తో పాటు ఒక వెరైటీగా భోజనం వడ్డించాలని ఆలోచన , సంకల్పం కలిగి ఇస్కాన్ కిచన్ తో సంప్రదింపులు జరిపారు, వారికి ఎన్నో వింపాలు చేసి , వారిని ఒప్పించి ఒక మెనును నిర్ణయించారు. ఆ ఒప్పందం అమలు జరిగేవిధంగా చర్యలు చేపట్టారు . ఇందులోభాగంగా శనివారం నాడు ఒక స్వీట్ తోపాటు పలావు కుర్మా, పెరుగు రు 5/-లకే వడ్డిస్తారు. దీంతో పేదల కు వారానికి ఒక సారి స్వీట్ తో నాణ్యమైన పౌష్టికాహారం వడ్డిస్తారు. పేదల కండ్లలో ఆనందం చూడటమే తమ లక్ష్యం అన్నారు. నిత్యం నాణ్యమైన పౌష్టికాహారం అందించినా కొంత మార్పు రావాలనే సంకలమేనన్నారు. అది కూడా మన గిద్దలూరు క్యాంటీన్ కు దక్కటం మాన్ అదృష్టమన్నారు. ఈ విధానం త్వరలో రాష్ట్రంమంతా అమలు జరుగుతుందని ఆశిస్తున్నా మన్నారు. అన్నా క్యాంటీన్లను ఏర్పాటు చేసి పేద బడుగుల ఆకలి తీర్చటం కూటమి ప్రభుతానికే సాధ్యమన్నారు

# పరిసరాల పరిశుభ్రత మన బాధ్యత



**మార్కాపురం టౌన్ పెన్ పపర్ జనవరి 24**
పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, దీని వల్ల కలిగే లాభాలను అందరూ గ్రహించి స్ఫూర్తిగా తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసరావు సూచించారు. శనివారం మార్కాపురం పట్టణంలో స్వచ్ఛభారత్ - స్వచ్ఛఆంధ్ర కార్యక్రమంలో భాగంగా గడియార స్తంభం నుంచి నాలుగు మాడవీధుల వరకు జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ సిబ్బందితో కలిసి ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవడం, బహిరంగ మల, మూత్ర విసర్జన వల్ల కలిగే నష్టాలు వివరించారు. ప్రతి ఇంటికి మరుగుదొడ్డి ఉండాలని, పచ్చదనం కోసం మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో తాహసిల్దార్ చిరంజీవి, మున్సిపల్ కమిషనర్ నారాయణరావు తదితర అధికారులు పాల్గొన్నారు.

# అద్దంకిలో నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత: ఈ.ఈ మస్తాన్ రావు

**అద్దంకి ఆర్సి ఇంచార్జ్, పెన్ పవర్ జనవరి 24:**
పట్టణంలోని రామ టాకీస్ బజారులో నూతన విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ను ఏర్పాటు చేస్తున్న కారణంగా ఆదివారం పట్టణంలోని పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఈ.ఈ మస్తాన్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 9:00 గంటల నుండి మధ్యాహ్నం 4:00 గంటల వరకు రామ టాకీస్ బజారు, గీతా మందిరం రోడ్డు, ఆర్ అండ్ బి బంగ్లా ప్రాంతం, మున్సిపల్ ఆఫీస్, దాని చుట్టుపక్కల ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుంది. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి, ముందస్తుగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుని విద్యుత్ శాఖకు సహకరించవలసిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు.

# సోమవారం మీ కోసం రద్దు

**– జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు**

**క్రైమ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ జనవరి 24**

జనవరి 26న గణతంత్ర దినోత్సవ సందర్భంగా ప్రకాశం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించవలసిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్.) కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేయడం జరిగిందని ప్రకాశం జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ఒక ప్రకటనలో తెలిపారు.

# ఘనంగా అంతర్జాతీయ బాలికల దినోత్సవం




**పొన్నలూరు పెన్ పవర్ జనవరి 24**

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చెన్నుపాడు జిల్లా పరిషత్ త్ ఉన్నత పాఠశాలలో శనివారం అంతర్జాతీయ బాలికల దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. చెన్ను పాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంగనవాడి యూనియన్ జిల్లా అధ్యక్షురాలు వై సత్యవతి మాట్లాడుతూ లింగ వివక్ష, లైంగిక వేధింపులు, బాల్య వివాహాలు, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, పౌష్టికాహారం, వ్యక్తిగత పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలమ్మ ప్రధానోపాధ్యాయుడు వై వెంకటేశ్వరరావు, మధురవాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

# మన గ్రామం మన సంస్కృతి సర్వే



**పొన్నలూరు పెన్ పవర్, జనవరి 24**

కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన మేరా గావ్ మేరీ దరోహర్ నవీకరించే ప్రక్రియను సులభతరం చేయాలని ఉద్దేశంతో ఈ డాక్యుమెంటేషన్ కార్యక్రమం ప్రారంభించారు. దీనిలో భాగంగా ఎం జి ఎం డి పోర్టల్ లో పురాతన కట్టడాలను, కోటలను ,పురాతర దేవాలయాలను, సాంప్రదాయాలు, ఆచారాలు నమ్మకాలు , చారిత్రక ప్రాధాన్యత ,ప్రముఖ వ్యక్తులు, ప్రసిద్ధ కళాకారులు, సాంప్రదాయ వంటకాలు, ఆభరణాలు ,జాతరలు పండుగలు వంటి భౌతికపరమైన సాంస్కృతిక వారసత్వాల అంశాల విస్తృత సమాచారం పొందుపరచడం జరుగుతుందని ఎంపీడీవో డాక్టర్ పి సుజాత శనివారం తెలిపారు. చెన్నిపాడులో వెలిసినటువంటి 14వ శతాబ్దం లో కాటమరాజు పరిపాలనలో రాజుల తదనంతరం చుండి రాజుల పరిపాలనలో శ్రీ గంగ సర్వ మంగళంభ సమేత శ్రీ సంగమేశ్వర స్వామి వారి పురాతన దేవాలయం అక్కడ ఉన్న శాసనాలను వీక్షించడం జరిగిందని సుజాత తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో సుబ్రహ్మణ్యం పంచాయతీ కార్యదర్శి రావణమ్మ, గ్రామ నాయకులు వెన్నపూస రామిరెడ్డి రమణారెడ్డి మాల కొండయ్య తిరుపాలు సచివాలయం సిబ్బంది జయ రాములు, సురేష్ లక్ష్మీపార్వతి దీప్తి పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# చెన్నుపాడులో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర

**పొన్నలూరు,పెన్ పవర్ జనవరి 24**

మండలంలోని చెన్ను పాడు గ్రామంలో శనివారం సర్పంచ్ సారమ్మ ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో డాక్టర్ పి సుజాత మాట్లాడుతూ ప్రతి కుటుంబం కూడా వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, ప్రతి గ్రామంలో పంచాయతీ పరిధిలో ప్రధాన బాధ్యత పంచాయతీ కార్యదర్శులు చూడాలని సూచించారు. ప్రతి ఇంటికి చెత్త సేకరణ జరగాలని వీధులు శుభ్రపరచాలని, మురిగినీరు ఎక్కడ నిల్వ ఉండకుండా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో యు సుబ్రహ్మణ్యం, పంచాయతీ కార్యదర్శి రవణమ్మ, గ్రామ నాయకులు వెన్నపూస రామిరెడ్డి రమణారెడ్డి మాలకొండయ్య తిరుపాలు సచివాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# గణతంత్ర దినోత్సవ వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తి

## నూతన మార్కాపురం జిల్లాలో తొలి గణతంత్ర దినోత్సవ వేడుకలు

## పోలీసు పరేడ్ రిహార్సల్స్ ను పరిశీలించిన జిల్లా ఇన్చార్జి ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు







**మార్కాపురం ఆర్ సి ఇంచార్జ్ పెన్ పవర్ జనవరి 24**

నూతన జిల్లా కేంద్రమైన మార్కాపురం పట్టణంలో 26వ తేదీన జరగనున్న 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు.ఈ వేడుకలను మార్కాపురంలోని ఎస్వీకేపి డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పెరేడ్ ప్రాంగణాన్ని, భద్రత ఏర్పాటులను జిల్లా ఎస్పీ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా పరేడ్ ఏర్పాట్లు, వేదిక నిర్మాణం, భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ, అధికారుల కూర్చునే ఏర్పాట్లు, ప్రజలకు కల్పించాల్సిన మౌలిక సదుపాయాలపై పోలీస్ అధికారులతో ఎస్పీ సమీక్ష నిర్వహించారు. తొలిసారిగా జిల్లా స్థాయిలో నిర్వహించనున్న గణతంత్ర వేడుకలు కావడంతో, వాటిని మరింత ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలన్నారు. అలాగే ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. ఈ వేడుకలకు అతిథులు, ప్రముఖులు, విద్యార్థులు హాజరు కానున్నందున అన్ని రకాల భద్రతా చర్యలు తీసుకోవాలని ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, వాహనాల పార్కింగ్ తదితర అంశాలపై అధికారులకు పలు సూచలను తెలియచేసారు. నూతన జిల్లాగా అవతరించిన మార్కాపురంలో తొలి గణతంత్ర దినోత్సవ వేడుకలు జరగడం గర్వకారణమని, అన్ని శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్పీ తెలిపారు. అనంతరం జనవరి 26న పోలీస్ పెరేడ్ గ్రౌండ్ నందు నిర్వహించే 77వ గణతంత్ర దినోత్సవ సందర్భంగా పోలీస్ బలగాలు, హోమ్ గార్డ్, ఎన్ సీసీ విభాగాలు నుండి 5 ప్లాటూన్ లు, ఎఆర్ ఎస్సై సురేష్ పెరేడ్ కమాండర్ గా నిర్వహించిన కవాత్ రిహార్సల్ ను జిల్లా ఎస్పీ పరిశీలించారు. రిహార్సల్స్ లో భాగంగా ముందుగా గౌరవ వందనం స్వీకరించి, జాతీయ పతాకం ఎగుర వేశారు. అనంతరం పరేడ్ పరిశీలన వాహనంలో వెళ్లి పోలీసు బలగాల పరేడ్ ను కూడా పరిశీలించి కవాత్ ను నిర్వహించడంలో కొన్ని సూచనలు, మెళుకువలు సూచించారు. వేడుకలకు హాజరయ్యే ముఖ్యఅతిథులు, ప్రజానీకానికి దేశ ఉన్నతిని చాటేలా పోలీస్ పరేడ్ సాగాలన్నారు. గణతంత్ర దినోత్సవ వేడుకలలో రెట్టించిన ఉత్సాహంతో కవాతు ప్రదర్శన చేయాలని జిల్లా ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం డిఎస్పీ యు.నాగరాజు, మార్కాపురం సీఐ సుబ్బారావు, ఆర్ఐ సీతారామరెడ్డి, మార్కాపురం టౌన్ ఎస్ఐ సైదు బాబు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

# నేడు శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి వారి దేవాలయం రథసప్తమి

## 350 మంది పోలీస్ సిబ్బందితో ప్రత్యేక బందోబస్తు

## భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఇన్చార్జి ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు





**మార్కాపురం ఆర్.సి ఇంచార్జ్ పెన్ పవర్ జనవరి 24**

మార్కాపురం పట్టణంలోని శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి వారి దేవాలయాన్ని శనివారం జిల్లా ఎస్పీ సందర్శించారు. మహోత్సవాల్లో భాగంగా రథసప్తమి సందర్భంగా చేపట్టిన భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా దేవాలయ పరిసరాలు, ప్రవేశ మార్గాలు, రథం వద్ద ఏర్పాటు చేసిన భద్రతా చర్యలు, బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ ఏర్పాట్లను సమీక్షించారు. పోలీస్ అధికారులతో పాటు ఆలయ కమిటీ సభ్యులకు పలు సూచనలు చేశారు. దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా బందోబస్తు ఏర్పాట్లు చేయాలని, వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా ప్రణాళికాబద్ధంగా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి వారి రథోత్సవానికి ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు రానున్న నేపథ్యంలో సుమారు 350 మంది పోలీస్ సిబ్బందితో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. అదనంగా ప్రత్యేక రెస్పాన్స్ టీమ్స్ ఏర్పాటు చేయడం జరిగిందని, వీటిలో పోలీసులు, ఫైర్ ఇంజన్, అంబులెన్స్ సిబ్బంది ఉంటారని తెలిపారు.ట్రాఫిక్కు ఎలాంటి ఆటంకాలు కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టామని, బయటి ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలకు ప్రత్యేక పార్కింగ్ సౌకర్యాలు కల్పించామని చెప్పారు. భక్తులు పోలీస్ వారికి సహకరించి, వారి సూచనలను పాటించాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.అనంతరం రథసప్తమి సందర్భంగా భద్రతా ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ పోలీస్ అధికారులతో జిల్లా పోలీస్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రథోత్సవం సమయంలో తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై పలు సూచనలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యే నేపథ్యంలో దేవాలయ పరిసరాలు, రథం వద్ద, ప్రధాన రహదారులు మరియు ప్రవేశ--నిష్క్రమణ మార్గాల్లో కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా క్యూలైన్లు, బారికేడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించాలని, బయటి ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలకు ప్రత్యేక పార్కింగ్ సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. అదనంగా ప్రత్యేక రెస్పాన్స్ టీమ్స్ను సిద్ధంగా ఉంచి, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సిబ్బంది విధుల్లో అప్రమత్తతతో, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం డీఎస్పీ నాగరాజు, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు, మార్కాపురం సీఐ సుబ్బారావు, వైపాలెం సీఐ అజయ్ కుమార్, కనిగిరి సీఐ శ్రీనివాసులు, కంభం సీఐ మల్లికార్జునరావు, గిద్దలూరు అర్బన్ సీఐ సురేష్, త్రిపురాంతకం సీఐ అస్సాం, ఆర్ఐ సీతారామిరెడ్డి, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనుల్లో నాణ్యత, వేగం కీలకం: మంత్రి గొట్టిపాటి

## అద్దంకి అభివృద్ధిపై మంత్రి గొట్టిపాటి సమీక్ష.. అధికారులకు కీలక ఆదేశాలు





**అద్దంకి ఆర్సి ఇంచార్జ్, పెన్ పవర్ జనవరి 24:**

అద్దంకి నియోజకవర్గ వ్యాప్తంగా వివిధ శాఖల ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపానికి ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశం ఉండకూడదని రాష్ట్ర ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులకు స్పష్టం చేశారు. శనివారం పుట్టావారిపాలెం క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నాణ్యతతో పాటు పనుల్లో జాప్యం జరగకుండా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. నాణ్యతా ప్రమాణాల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని, ఏవైనా లోపాలు ఉంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. శాఖల వారీగా మంత్రి జారీ చేసిన ఆదేశాలు.

**తాగునీరు –మౌలిక వసతులు**

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు నిరంతర తాగునీటి సరఫరా అందేలా చూడాలి. ఇళ్ల స్థలాల వద్ద రహదారులు, డ్రైనేజీ, విద్యుత్ సరఫరా పనులను సమన్వయంతో పూర్తి చేయాలి.

**ఆర్ అండ్ బీ :** రహదారి నిర్మాణాలు దీర్ఘకాలికంగా మన్నేలా నాణ్యమైన సామగ్రితో చేపట్టాలి.

**వైద్యం – ఆరోగ్యం :** ప్రభుత్వ హెల్త్ సెంటర్ల నిర్మాణాలు, మరమ్మతులు నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన వైద్యం అందేలా చూడాలి.విద్యుత్ శాఖ విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడటంతో పాటు, కొత్త కనెక్షన్లు మరియు లైన్ అప్ గ్రేడేషన్ పనులను వేగవంతం చేయాలి. కమ్యూనిటీ హాళ్లుప్రజల అవసరాలకు అనుగుణంగా కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.

**అద్దంకిని ఆదర్శంగా తీర్చిదిద్దుదాం**

అద్దంకి నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే అభివృద్ధిలో ముందుండేలా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆయన పిలుపునిచ్చారు.

# మాలకొండ ఆదాయం రూ. 9,03,834

**వలేటివారిపాలెం, పెన్ పవర్ జనవరి 24**

అయ్యవారి పల్లి పంచాయతీ పరిధిలోని మాలకొండ లో వెలిసియున్న శ్రీ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి వారికి శనివారం భక్తుల నుండి వివిధ రూపాల ద్వారా రూ 9,03,834 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్ చంద్రశేఖర్ తెలిపారు. ఆలయ అర్చకులు గౌరి శంకర్, నృసింహ చార్యులు స్వామివారిని అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# రహదారి భద్రత పై 29 న వ్యాసరచన క్విజ్ పోటీలు

**క్రైమ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ జనవరి 24**

జాతీయ రహదారి భద్రతా మాసోత్సవం సందర్భంగా ప్రకాశం జిల్లా రవాణాశాఖ ఒంగోలు వారి సౌజన్యంతో జిల్లాలోని అన్ని ప్రభుత్వ.. ప్రైవేటు పాఠశాలల్లోని విద్యార్థినీ, విద్యార్థులకు "రహదారి భద్రత' పై అవగాహన కల్పించుటకు పాఠశాల స్థాయిలో వ్యాస రచన, క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి సి.వి.రేణుక తెలిపారు. ఈ సందర్భంగా కేంద్రప్రభుత్వం సడక్ సురక్షా అభియాన్ అనే నినాదం తో శిక్షణ తో భద్రత, సాంకేతికత ద్వారా పరివర్తన అనే థీమ్ ఇవ్వడం జరిగినది. పాఠశాల స్థాయి లో గెలుపొందిన విద్యార్థినీ, విద్యార్థులకు జిల్లా స్థాయి లో ఒంగోలులోని డి.ఆర్. ఆర్.యం మునిసిపల్ ఉన్నత పాఠశాల నందు ఈనెల 29 న ఉదయం 9.30 గంటలకు పోటీలు నిర్వహించబడును. కావున జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థినీ, విద్యార్థులు పాఠశాల స్థాయి పోటీల్లో పాల్గొనవలసినదిగా జిల్లా విద్యాశాఖాధికారి సి.వి.రేణుక తెలియజేశారు. 30వ తేదీన విజేతలకు కలెక్టర్ చేతుల మీదుగా బహుమతి ప్రదానం ఉంటుందని తెలిపారు.

# వైకాపా ఎంపిటిసిల సమస్యలపై మీడియా సమావేశం



**గిద్దలూరు పెన్ పవర్ జనవరి 24**

గిద్దలూరు నియోజకవర్గ వైఎస్సార్సిపి కార్యాలయంలో ఎంపిటిసిల సమస్యలపై మాజీ ఇంచార్జి కె. పి. నాగార్జున రెడ్డి ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించారు. గౌరవ వేతనం రాలేదని ఈ సమావేశంలో ఎంపిటిసిలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించి, వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు అవసరమైన చర్యలు చేపడతామని ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కె. పి. నాగార్జున రెడ్డి మాట్లాడుతూ, గ్రామస్థాయిలో అభివృద్ధికి కీలక పాత్ర పోషిస్తున్న ఎంపిటిసిలకు సరైన గౌరవ వేతనం, అధికారాలు, వసతులు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుత పాలకులు ఎంపిటిసిలను నిర్లక్ష్యం చేస్తున్నారని, వారి సమస్యలను పరిష్కరించడంలో విఫలమవుతున్నారని విమర్శించారు. వైఎస్సార్సిపి పార్టీ ఎప్పుడూ పంచాయతీ రాజ్ ప్రతినిధుల పక్షానే నిలుస్తుందని, అవసరమైతే ఉద్యమాల ద్వారా హక్కులు సాధిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపిలు మేడూరి వెంకట్ రావు, వేగినాటి ఓసురా రెడ్డి, చేగిరెడ్డి తులసమ్మ, ఓబుల్ రెడ్డి, కడప వంశీధర్ రెడ్డి, జెడ్పిటిసిలు సారె వెంకట నాయుడు, పగడాల శ్రీరంగం, రాష్ట్ర బూత్ కమిటీ విభాగ ప్రధాన కార్యదర్శి బొర్రా కృష్ణ రెడ్డి, ప్రకాశం జిల్లా పంచాయతీ రాజ్ విభాగ అధ్యక్షులు నన్నే బోయిన రవికుమార్ యాదవ్, ప్రకాశం జిల్లా వైఎస్సార్సిపి ఉపాధ్యక్షులు వెన్న భాస్కర్ రెడ్డి, గిద్దలూరు నియోజకవర్గ పంచాయతీ రాజ్ విభాగ అధ్యక్షుడు మల్లెల చంద్రశేఖర్ రెడ్డి, మండల కన్వీనర్లు ఆవుల శ్రీధర్ రెడ్డి, బత్తేమ్ ఓబుల్ రావు, మానం బాలి రెడ్డి అన్ని మండలాల వైఎస్సార్సిపి ఎంపిటిసిలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సమావేశం ద్వారా ఎంపిటిసిల సమస్యలను ఐక్యంగా పోరాడుతూ పరిష్కరించుకునే దిశగా ముందుకు సాగాలని నాయకులు పిలుపునిచ్చారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, Published at D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Editor: G.APPARAO, (Responsible for selection of news under the PRB Act ) RNI : APTEL/2014/58046 e-mail:penpower9@gmail.com